రాజమహేంద్రవరం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 40.0 (గురువారం)
కనిష్ఠం : 25.0

పదవి.. మరింత బాధ్యత పెంచింది!

ఎస్సీ కమిషన్ చైర్మన్ జవహర్

కొవ్వూరు, మే 15 (ఆంధ్రజ్యోతి) : దళితుల అభివృద్ధి సంక్షేమానికే ప్రభుత్వం ఎస్సీ కమిషన్ ఏర్పాటు చేసిందని ఎస్సీ కమిషన్ చైర్మన్ కె.ఎస్.జవహర్ అన్నారు. ఎస్సీ కమిషన్ చైర్మన్‌గా తొలిసారి నియోజకవర్గానికి వచ్చిన జవహర్‌కు గురువారం కొవ్వూరు మండలం ఐ.పంగిడి గ్రామంలో ఘనంగా స్వాగతం పలికారు.పంగిడి నుంచి కార్లు, మోటారుసైకిళ్లపై కాపవరం, దొమ్మేరు మీదుగా కొవ్వూరు వరకూ ర్యాలీ చేశారు. మార్గమధ్యలో బాబూ జగ్జీవన్‌రామ్, అంబేడ్కర్, ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జవహర్ నివాసంలో విలేకరులతో మాట్లాడారు. పదవి తన బరువు, బాధ్యతలు మరింత పెంచిందన్నారు. రాష్ట్రంలో వివక్షత లేని సమసమాజం స్థాపిస్తామన్నారు..గత ప్రభుత్వంలో శిరోముండనం నుంచి ఎమ్మెల్సీలు హత్యలు చేసి జైలుకు వెళ్లిన సంఘటనలు చూశామన్నారు. రాళ్ళ దాడులు, భూఆక్రమణలు, కబ్జాలు చూశామని, వీటన్నింటినీ నియంత్రించడమే నా ముందున్న పెద్ద సవాలన్నారు.కార్యక్రమంలో బూరుగుపల్లి రాఘవులు,వేగి చిన్నా, కోడూరి ప్రసాద్, పసలపూడి బోసు, పి.వి.వి.భద్రం, డా.ముళ్ళపూడి రాజేంద్రప్రసాద్, పి.కె.రంగారావు, ఆలపాటి సాయికృష్ణ, బిక్కిన పణీంద్ర, ఖండబట్టు విజయలక్ష్మి, చిట్టూరి వెంకటేశ్వరరావు, పిక్కినాగేంద్ర పాల్గొన్నారు.


పంగిడిలో జవహర్‌కు గజమాల వేసి ఘనంగా స్వాగతం పలుకుతున్న టీడీపీ నాయకులు, అభిమానులు

మన దైవం కాటన్ : దుర్గేష్


కేక్ కట్ చేస్తున్న మంత్రి దుర్గేష్, ఇన్‌సెట్‌లో కాటన్ విగ్రహానికి పూలమాల

కడియం, మే 15(ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల ఆరాధ్య దైవం కాటన్ మహాశయుడు అని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు.సర్ ఆర్థర్‌కాటన్ నర్సరీ అసోసియేసన్ కార్యాలయం వద్ద అసోసియేషన్ అధ్యక్షుడు రత్నం అయ్యప్ప, కార్యవర్గ సభ్యుల ఆధ్వర్యంలో కాటన్ జయంతి కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించారు.మంత్రి కందుల దుర్గేష్, టీడీపీ రాష్ట్ర వైద్యవిభాగం ప్రధాన కార్యదర్శి డా.గోరంట్ల రవిరామ్‌కిరణ్ కాటన్ మహాశయుడి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.కేక్ కట్ చేసి నాయకులకు పంచారు. కడియం నర్సరీరంగానికి కూటమి ప్రభుత్వం అండగా ఉం టుందని తెలిపారు.అనంతరం మంత్రి దుర్గేష్, టీడీపీ రాష్ట్ర నాయకులు డా.గోరంట్ల రవిరామ్‌కిరణ్‌లను నర్సరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో సత్కరించారు.కార్యక్రమంలో నర్సరీ సంఘం ఉపాధ్యక్షుడు బోడపాటి గోపి, ఐఎన్‌ఏ మాజీ డైరెక్టర్ మార్గాని సత్యనారాయణ, పుల్లా అబ్బులు, ఇన్‌చార్జి సర్పంచ్ పాటంశెట్టి రాంజీ, వైస్ ఎంపీపీ పంతం గణపతి, ముద్రగడ జమీ, మార్గాని ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.



పుష్కరాలకు 27 రహదారుల విస్తరణ

రాజమహేంద్రవరం సిటీ, మే 15 (ఆంధ్రజ్యోతి): గోదావరి పుష్కరాలు 2027కు ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు ఇప్పటి నుంచే రహదారుల విస్తరణ పనులు రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ చేపట్టింది. ఈ మేరకు గురువారం నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్ గార్గ్ ఒక ప్రకటన విడుదల చేశారు. 24 ప్రధాన రహదారులను విస్తరిస్తామని పేర్కొన్నారు.రహదారుల విస్తరణ పనులు ఫేజ్ 1,2 విధానంలో చేస్తున్నామన్నారు. ఫేజ్-1లో భాగంగా ఇప్పటికే ఈస్ట్ రైల్వే స్టేషన్ రోడ్డు, మోరంపూడి రోడ్డు, కోరుకొండ రోడ్డు, గుండువారి వీధి గాడాలమ్మ టెంపుల్ రోడ్డు విస్తరణ పనులు చేపట్టినట్టు వెల్లడించారు. దాదాపు 50 శాతానికి పైగా పనులు పూర్తికాగా ఈ ఐదు రహదారులకు సంబంధించి టీడీఆర్ బాండ్ల జారీ ప్రక్రియను త్వరలో పూర్తి చేస్తామన్నారు. ఫేజ్ -2 లో మరో పది రహదారులను అభివృద్ధి చేస్తామన్నారు. కొత్త మాస్టర్ ప్లాన్ ప్రకారం కోటిలింగాల ఘాట్ రోడ్డు, జెండా పంజారోడ్డు, కాతేరు రోడ్డు, స్టేడియం రోడ్డు, ఓల్డ్ బైపాస్‌రోడ్డు, సీతంపేట రోడ్డు, టీంబర్ యార్డు మెయిన్ రోడ్డు, మూలగొయ్యి జంక్షన్, ఉండవల్లి వారి వీధి, శేషయ్యమెట్ట జంక్షన్‌రోడ్డును విస్తరించడం జరుగుతుందన్నారు. ప్రైవేట్ భవన యజమానులు స్వచ్ఛందంగా రోడ్డు విస్తరణకు ముందుకు వచ్చి అంగీకార పత్రాలను నగరపాలక సంస్థకు అందజేశారన్నారు. విస్తరణలో వారి ఆస్తి అర్హతను బట్టి భవన యజమానులకు నష్టపరిహారం ఇవ్వడం జరుగుతుందన్నారు. ఫేజ్ 1,2 కలిపి 15 రహదారుల అభివృద్ధికి నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళిక విభాగం ఆధ్వర్యంలో 15 టీమ్‌లు సైతం ఏర్పాటు చేసుకున్నామన్నారు. ప్రతి కమిటీలోను ఒక అసిస్టెంట్ సిటీ ప్లానర్ ,టౌన్ సర్వేయర్, టీపీబీవో, వీఆర్‌వో , సచివాలయ కార్యదర్శులు ఉంటారన్నారు. రోడ్డు విస్తరణ అభివృద్ధి పనులు పూర్తయిన తర్వాత వాహనాల రద్దీ కారణంగా ఎదురవుతున్న సమస్యలన్నీ తొలగిపోతాయన్నారు. నగర అభివృద్ధికి ప్రజలంతా సహకరించాలని కమిషనర్ కోరారు.



కొత్త కార్డుకు కష్టాలు

(పిఠాపురం- ఆంధ్రజ్యోతి)

కొత్త రేషన్‌కార్డులకు దరఖాస్తులను స్వీకరిస్తామని ప్రభుత్వం ప్రకటించిన ఆనందం ఆన్‌లైన్ కష్టాలతో ఆవిరైపోతోంది. దరఖాస్తులకు పెట్టిన నిబంధనలతో ప్రజలు సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో తప్పులతడకగా ఉన్న హౌస్ మ్యాపింగ్‌ను ఇప్పుడు దరఖాస్తుల స్వీకరణకు ప్రామాణికంగా తీసుకోవడంతో పాట్లు తప్పట్లేదు. అందులో కుటుంబసభ్యుల మ్యాపింగ్ ఒకేచోట జరగకుంటే వారి దరఖాస్తులు ఆన్‌లైన్ కావట్లేదు. మ్యారేజ్ సర్టిఫికెట్‌ను తప్పనిసరి చేయడంతో అది ఎలా తెచ్చుకోవాలో తెలియక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ఇది తప్పనిసరి కాదని మంత్రులు, ప్రజాప్రతినిధులు ప్రకటించినా అది లేకుండా దరఖాస్తు తీసుకోకపోవడంతో ప్రజలకు కష్టాలు తప్పడం లేదు. తాజాగా ఆశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ సైతం ప్రకటించారు. ఇక బయోమెట్రిక్స్ పడకపోయినా దరఖాస్తు ఆన్‌లైన్ కావట్లేదు. ఓటీపీ ఆప్షన్ డిజేబుల్ చేయడంతో వేలిముద్రలు పడని వారు పడుతున్న ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా ఇదే స్థితి నెలకొంది.

- నూతన రేషన్‌కార్డులకు ఆన్‌లైన్‌లో అవస్థ
- మ్యాపింగ్ ఆధారంగానే దరఖాస్తుల స్వీకరణ
- నాటి హౌస్‌మ్యాపింగ్‌లో పలు లోపాలు
- కొత్త కార్డుల జారీకి అదే ప్రామాణికం
- మ్యారేజ్ సర్టిఫికెట్‌కు తంటాలు
- అవసరం లేదంటున్న మంత్రి నాదెండ్ల
- బయోమెట్రిక్స్ పడకుంటే నో ఛాన్స్
- ఓటీపీ ఆప్షన్ డిజేబుల్
- రేషన్‌కార్డు దరఖాస్తు ఉచితం
- రూ.100 వసూలు చేస్తున్న సిబ్బంది
- సచివాలయాల్లో దరఖాస్తులకు పాట్లు

నిబంధనాలు

కూటమి ప్రభుత్వం నూతన రేషన్‌కార్డుల జారీ, కార్డుల విభజన, కొత్తగా కుటుంబ సభ్యుల చేర్పులు, తొలగింపులు, చిరునామా మార్పులకు దరఖాస్తుల స్వీకరణతో పాటు ఇప్పటికే రైస్ కార్డులు ఉన్న వారు వాటిని ప్రభుత్వానికి సరెండర్ చేసే అవకాశాన్ని కల్పించింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల్లోని అన్ని వార్డు, గ్రామ సచివాలయాల్లో కొన్ని రోజులుగా దరఖాస్తుల స్వీకరణ జరుగుతోంది.దరఖాస్తులను ఆన్‌లైన్ చేసే ప్రక్రియలో విధించిన నిబంధనలు ఇప్పుడు కొత్త కష్టాలు తెచ్చిపెట్టాయి. అన్ని సరిచూసుకుని అప్‌లోడ్ చేసే సమయానికి సర్వర్లు పనిచేయక దరఖాస్తు చేసుకునేందుకు మూడు, నాలుగుసార్లు సచివాలయాలకు వెళ్లాల్సి వస్తోంది. కార్డులకు ఇన్ని నిబంధనలు ఉంటే ఎలాగంటూ పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

మ్యాపింగ్ తంటా..

రేషన్‌కార్డుకు వివాహమై పిల్లలు ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలంటే భార్యాభర్తలు, పిల్లలు ఒకేచోట హౌస్ మ్యాపింగ్ ఉండాలి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో వలంటీర్ల ద్వారా కుటుంబాల స్థితిగతులను తెలుసుకునేందుకు హౌస్‌హోల్డ్ మ్యాపింగ్ చేశారు. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం దరఖాస్తుల స్వీకరణకు దీనినే ప్రామాణికంగా నిర్దేశించింది. తల్లిదండ్రులు, వారి పిల్లలు ఒకే కుటుంబం అయినప్పటికీ మ్యాపింగ్‌లో ఒకేచోట లేకపోతే దరఖాస్తు స్వీకరణ సమయంలో ఆన్‌లైన్‌లో ఎర్రర్ చూపిస్తోంది. అప్పుడు వలంటీర్లు చేసిన తప్పిదాలు ఇప్పుడు రేషన్‌కార్డు దరఖాస్తుదారులకు శాపంగా మారాయి. మ్యాపింగ్‌లో మార్పులు, చేర్పులు, ఎడిట్ చేసే అవకాశాన్ని ఇవ్వకపోవడం పెద్ద సమస్యగా మారింది. ఈ సమస్యను పరిష్కరించకపోతే కొత్త రేషన్‌కార్డు పొందే అవకాశాన్ని కోల్పోతారు.

నిబంధనలు సడలించాలి..

హౌస్‌హోల్డ్ మ్యాపింగ్ నిబంధన తొలగించడంతోపాటు ఆధార్ ఆధారంగానే దరఖాస్తుల స్వీకరణ ఉండాలని, మ్యారేజ్ సర్టిఫికెట్ నిబంధన తొలగించి వీఆర్వో లేదా సంబంధిత పంచాయతీ కార్యదర్శి ధ్రువీకరణతో ఆన్‌లైన్ చేసే అవకాశం కల్పించాలని, బయోమెట్రిక్స్‌తోపాటు ఓటీపీ ఆప్షన్ ఇవ్వాలని, ఉమ్మడి కార్డులో ఉన్న ఎంతమందైనా విడిగా కార్డులకు దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించాలని పలువురు సూచిస్తున్నారు.

దరఖాస్తు చేయాలంటే రూ.100

రేషన్‌కార్డు దరఖాస్తు ప్రభుత్వం ఉచితమని ప్రకటించింది. అయితే సచివాలయ సిబ్బంది మాత్రం కార్డుకు రూ.100 వసూలు చేస్తున్నట్టు సమాచారం. తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరంలోని ఒక సచివాలయంలో దరఖాస్తుదారుల నుంచి ఒక్కో కార్డుకు రూ.100 వసూలు చేస్తున్నట్టు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా చాలాచోట్ల ఇదే పరిస్థితి ఉంది.

మ్యారేజ్ సర్టిఫికెట్ అక్కర్లేదు!

కొత్తగా కార్డు పొందడానికి మ్యారేజ్ సర్టిఫికెట్ తప్పనిసరి చేశారు. వివాహమైన వారిలో 95 శాతం మంది రిజిస్ట్రేషన్ చేసుకోరు. దీంతో ఇప్పుడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు వెళ్లి మ్యారేజ్ రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇందుకు రూ.2,500 నుంచి రూ.5 వేల వరకు ఖర్చు చేయాల్సి వస్తోందని పలువురు వాపోతున్నారు. అయితే మ్యారేజ్ సర్టిఫికెట్ అవసరం లేదని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ గురువారం ప్రకటించారు.

బయోమెట్రిక్స్...

కార్డుల దరఖాస్తులను ఆన్‌లైన్ చేసే ప్రక్రియలో ప్రధాన దరఖాస్తుదారుడు తప్పనిసరిగా తన బయోమెట్రిక్స్ (వేలిముద్రలు) వేయాల్సి ఉంటుంది. బయోమెట్రిక్స్ పడకుంటే దరఖాస్తు ఆన్‌లైన్ కావట్లేదు. గతంలో ఆధార్‌కు లింక్ అయిన మొబైల్‌కు ఓటీపీ వచ్చేది. దీని వల్ల బయోమెట్రిక్స్ పడనివారికి ఉపయోగకరంగా ఉండేది. ఓటీపీ ఆప్షన్ డిజేబుల్ చేశారని చెబుతున్నారు.

ఇద్దరుంటే.. ఒకరికే ఛాన్స్

తల్లిదండ్రులతో కలిసి ఉన్న కొడుకులు, కుమార్తెలకు వివాహమై కొత్త కార్డు పొందేందుకు విభజన అవకాశాన్ని కల్పించిన ప్రభుత్వం దానిని ఒక్కరికే పరిమితం చేసింది. ఇద్దరు పిల్లలు ఉండి, వారికి వివాహమైతే అందులో ఒక్కరినే విభజించే అవకాశం ఉండడంతో రెండో వారు దరఖాస్తు చేసుకునే వీల్లేకుండా పోతోంది.

- మ్యాపింగ్ సమయంలో భర్త వేరే ప్రాంతంలో ఉండడంతో పేరు కుటుంబంలో చేర్చకున్నా భార్యపిల్లలకు కార్డు రావడం లేదు. భర్త లేకుండా విడిగా దరఖాస్తు చేసుకునే అవకాశం లేదు.

ఆధార్ చిరునామాతోనే...

- ఆధార్ కార్డులో ఉన్న చిరునామానే దరఖాస్తు స్వీకరణ సమయంలో పరిగణనలోకి తీసుకుంటున్నారు. చిరునామా మార్పునకు అవకాశం ఇవ్వకపోవడంతో పాత చిరునామాలతోనే దరఖాస్తు చేస్తున్నారు. వివాహమైన తర్వాత ఆధార్‌లో భార్య ఇంటి పేరు మారకున్నా, భార్యాభర్తల ఇంటి పేర్లు ఒకేలా లేకున్నా ఆన్‌లైన్‌లో తీసుకోవట్లేదు. చదువుకున్న వారు ఉద్యోగాల కోసం ఆధార్‌లో ఇంటి పేరు మార్చుకోవడం లేదు. అటువంటి వారికి ఇబ్బంది ఎదురవుతోంది.
- చిన్నారుల బాల ఆధార్ అప్‌డేట్ అయితే కానీ వారి పేర్లను తల్లిదండ్రుల కార్డుల్లో చేర్చడానికి అవకాశం ఉండట్లేదు. ఇప్పుడు అప్‌డేట్ చేయించాలంటే కార్డుల దరఖాస్తు గడువు ముగిసిపోతుందని చెబుతున్నారు. దీంతో తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గడువు ఇవ్వాలని కోరుతున్నారు.


రాఘవకుమార్‌కు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలుపుతున్న ఉద్యోగులు

ఆర్టీసీ జిల్లా ఇన్‌ఛార్జిగా రాఘవకుమార్

రాజమహేంద్రవరం అర్బన్, మే 15 (ఆంధ్రజ్యోతి) :డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆర్టీసీ అధికారిగా పనిచేస్తున్న ఎస్టీపీ రాఘవకుమార్ గురువారం తూర్పుగోదావరి జిల్లాకు ఇన్‌చార్జి అధికారిగా ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఇటీవలే ఇక్కడ పనిచేస్తున్న షర్మిలాఅశోక వేరేచోటకు బదిలీ కావడంతో రాఘవకుమార్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు.ఈ నేపథ్యంలో రాఘవకుమార్ రాజమహేంద్రవరంలోని ఆర్ఎం కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. పలువురు కార్యాలయ అధికారులు కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షకు 495 మంది గైర్హాజరు

రాజమహేంద్రవరం, మే 15(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షల్లో భాగంగా గురువారం నిర్వహించిన పరీక్షలకు 495 మంది గైర్హాజరయ్యారని ఆర్ఐవో ఎన్ ఎస్వీఎల్ నరసింహం తెలిపారు. ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోలేదన్నారు.

పారిశ్రామికవేత్తలుగా డ్వాక్రా మహిళలు : జేసీ

రాజమహేంద్రవరం, మే 15(ఆంధ్రజ్యోతి): ఈ నెలాఖరు నాటికి 2 వేల మంది స్వయం సహాయక సంఘాల మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే ప్రక్రియలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జేసీ ఎస్.చిన్నరాముడు పేర్కొన్నారు.కలెక్టరేట్‌లో డీఆర్‌డీఏ, మెప్మా, బ్యాంకర్లతో గురువారం నిర్వహించిన సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. డ్వాక్రా మహిళల ఆర్థిక సాధికారతకు వ్యవసాయ అనుబంధ రంగాల వారీగా కార్యాచరణ ప్రణాళిక రూపొందించామన్నారు.ఈ లక్ష్య సాధనకు బ్యాంకర్లు రుణాలు మంజూరు చేయాలన్నారు. ఇప్పటికే ఆయా శాఖల ఆధ్వర్యంలో యూనిట్ల స్థాపనకు మండల పరిధిలో లక్ష్యా ల్ని నిర్దేశించామన్నారు.కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ మూర్తి,ఎల్‌డీఎం డీవీ ప్రసాద్ పాల్గొన్నారు.

కాలం తీసిన.. మందులు దాచారు!



- పొలమూరు వెల్‌నెస్ సెంటర్‌లో వైద్య సిబ్బంది నిర్లక్ష్యం
- 2022 నుంచి 2024 వరకు కాలం తీరిన మందులు
- అడుగుదామని ప్రయత్నిస్తే కానరాని సిబ్బంది

అనపర్తి, మే 15 (ఆంధ్రజ్యోతి) : కాలం చెల్లిన మందులు విషంతో సమానం.. ఆ మందులు వినియోగిస్తే ఎన్నో సమస్యలు వస్తాయి. అయితే జిల్లాలోని ఒక ప్రభుత్వ ఆసుపత్రిలో మాత్రం అవే మందులు వినియోగిస్తున్నట్టు సమాచారం. పల్లెటూరు వాసులు జర్వం వచ్చినా చిన్న దెబ్బ తగిలినా వెంటనే పరిగెత్తేది గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికే. వారు ఇచ్చే మందులు రోజుకు ఎన్ని సార్లు వేసుకోవాలి అని అడగడం తప్ప మందుల కాల పరిమితి ఎంత ఎప్పుడు తయారైంది ఎప్పటి వరకు వాడవచ్చన్న కనీస అవగాహన ఉండదు. దీంతో వైద్య సిబ్బంది ఏ మందు ఇస్తే అదే వేసుకుంటారు.. అయితే ప్రభుత్వం గ్రామాల్లో ప్రజారోగ్యం కోసం ఏర్పాటు చేసిన హెల్త్ క్లినిక్‌లలో సిబ్బంది నిర్లక్ష్యంతో అనేక మంది అనారోగ్యాల భారిన పడుతున్నారు.అనపర్తిలోని సచివాలయం 5 పరిధిలోని వెల్‌నెస్ సెంటర్‌పై ఇటీవల కాలంలో అనేక ఫిర్యాదులు వస్తున్నాయి. విలేజ్ క్లినిక్‌లో విధులు నిర్వహిస్తున్న ఏఎన్ఎం రాజేశ్వరి సక్రమంగా విధులు నిర్వహించడం లేదని వచ్చిన రోగులపై విరుచుకు పడుతున్నారని ఫిర్యాదులు రావడంతో ఎంపీడీవో రామకృష్ణారెడ్డి క్లినిక్‌లో విచారణ నిర్వహించి సిబ్బందిని మందలించారు. అయినా వెల్‌నెస్ సెంటర్లలో పరిస్థితి మారకపోవడంతో అనేక విమర్శలు వినిపిస్తున్నాయి. ఇదిలా ఉండగా గురువారం పొలమూరులోని వెల్‌నెస్ క్లినిక్ సెంటర్‌కు వెళ్లిన మీడియాకు క్లినిక్‌లో సిబ్బంది ఎవరూ కనిపించలేదు. సెంటర్‌లో విధులు నిర్వహిస్తున్న ఎమ్ఎల్‌హెచ్‌పీ నాగరాణి గత నెల 26 నుంచి ధర్నాలో ఉండడంతో సెంటర్‌లో ఏఎన్ఎం కాని ఆశ వర్కర్ గాని ఉండాల్సి ఉండగా సెంటర్‌లో ఎవరూ లేరు. చివరకు అక్కడ ఉన్న మందులను పరిశీలించగా ఎక్కడ చూసినా కాలం చెల్లిన మందులే దర్శనమిచ్చాయి. దగ్గు మందు నుంచి ఇంజక్షన్లు,మాత్రలు వంటి అనేక మందులు కాలం చెల్లినవిగా ఉన్నాయి.వీటిలో కొన్ని 2022లోనే కాలం చెల్లినవి మరికొన్ని 2023, 2024 ఇలా అనేక మందులు దర్శనమిచ్చాయి. విషయం తెలుసుకుని అక్కడికి చేరుకున్న కూటమి నాయకులు ఉన్నతాధికారులకు ఫోన్‌లో పరిస్థితి వివరించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించి ప్రజల ఆరోగ్యంతో ఆటలాడుతున్న సిబ్బందిపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.








కాలం చెల్లిన మందులు.. ఆసుపత్రిలో పరిశీలిస్తున్న కూటమి నాయకులు

యువకుడి ఆత్మహత్య

నిడదవోలు, మే 15 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ కలహాల కారణంగా ఒక యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నిడదవోలు మండలం పురుషోత్తపల్లికి చెందిన తణుకు మోహనకృష్ణ(31) డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు.అయితే ఇటీవల ఇంట్లో తల్లి, భార్యకు అసలు పడడం లేదు. ఈ నేపథ్యంలో తరచూ గొడవలు జరుగుతున్నాయి.భరించలేకపోయిన మోహనకృష్ణ బుధవారం కలుపుమందు తాగేశాడు. కుటుంబీకులు గమనించి రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. మృతుడికి భార్య, పిల్ల లు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.



3 గంటల పాటు నిలిచిన వివేక్ ఎక్స్‌ప్రెస్

సాంకేతిక లోపం కారణంగా దేశంలోనే అతి ఎక్కువ దూరం ప్రయాణించే వివేక్ ఎక్స్‌ప్రెస్ రైలు రాజమహేంద్రవరంలో గురువారం రాత్రి 3 గంటల పాటు నిలిచిపోయింది.. - వివరాలు 7లో

తూర్పున వైద్యం అద్వితీయం

రాష్ట్రస్థాయిలో జిల్లాకు రెండో ర్యాంకు 7

ఐదు రోజుల చిన్నారి.. రూ.4 లక్షల సాయం

చిన్నారికి తీవ్ర అనారోగ్యం.. మంత్రి దుర్గేష్ దాతృత్వం

నిడదవోలు, మే 15 (ఆంధ్రజ్యోతి) : ఆ చిన్నారికి ఐదు రోజులు.. అయితే గుండె, ఊపిరితిత్తుల సమస్యతో జన్మించింది.. ప్రస్తుతం రాజమహేంద్రవరంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స చేస్తున్నారు.నిడదవోలు మండలం కోరుమామిడి గ్రామానికి చెందిన పసలపూడి నాగచంద్రంకు ఈ నెల 11వ తేదీన ఒక చిన్నారి జన్మించింది. అయితే చిన్నారి పుట్టిందన్న ఆనందం క్షణాల్లో ఆవిరైంది. ఎందుకంటే పెద్ద అనారోగ్య సమస్యలో జన్మించడంతో రెక్కాడితే కానీ డొక్కాడని తల్లిదండ్రులు ఉన్న కాస్తపాటి సొమ్ము చిన్నారి వైద్యానికి ఖర్చు చేసేశారు. ఇక చేసేది లేక ఏం చేద్దామా అని ఆలోచనలో పడ్డారు. ఈ విషయం అమరావతిలో కేబినెట్ మీటింగ్‌లో ఉన్న రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖా మంత్రి కందుల దుర్గేష్ తెలిసింది. అంతే ఆయన వెంటనే స్పందించారు. ఆ చిన్నారికి మెరుగైన వైద్య సేవలందించేందుకు 24 గంటల లోపుగానే రూ.4 లక్షల లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎన్‌వోసీ)ని మంజూరు చేయి ంచారు. ఆ చిన్నారికి తక్షణ వైద్య చికిత్స అందించాలని సూచించారు.



ప్రజారోగ్యానికి దోమలే ప్రథమ శత్రువు

- సగం అనారోగ్య సమస్యలకు ఇవే మూలం
- పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే డెంగ్యూ దూరం
- గడిచిన పదేళ్లలో డెంగ్యూ వ్యాధి తగ్గుముఖం
- వ్యాది నిర్ధారణ కేంద్రాలు మరిన్ని అవసరం
- మాక్-ఎలీసాదే తుది నిర్ధారణ పరీక్ష
- నేడు జాతీయ డెంగ్యూ అవగాహన దినం

(పి.గన్నవరం-ఆంధ్రజ్యోతి)

'పరిశీలించండి...శుభ్రం చేయండి...మూతలు పెట్టండి అనే మూడు పద్ధతుల ద్వారా డెంగ్యూను పూర్తిగా ఓడించండి' ఇదీ వైద్య ఆరోగ్యశాఖ నినాదం. ఎందుకంటే దోమలు ప్రజారోగ్యానికి ప్రధాన శత్రువులుగా భావించవచ్చు. దోమల ద్వారా మలేరియా, ఫైలేరియా, డెంగ్యూ, చికున్ గున్యా, మొదడువాపు, జికా వంటి ప్రధాన వ్యాధులు వ్యాపిస్తాయి. అయితే ప్రజల్లో డెంగ్యూ వ్యాధి గురించి ప్రత్యేక అవగహన కార్యక్రమాలు, నివారణ చర్యలపై దృష్టిపెట్టడం వంటి ప్రధాన లక్ష్యంతో గత పదేళ్లగా రాష్ట్ర ప్రభుత్వం డెంగ్యూ వ్యాధిని తగ్గించడంలో గణనీయమైన ప్రగతిని సాధించిందని చెప్పవచ్చు. ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవడంతో డెంగ్యూ లక్షణాలు ఉన్నప్పటికీ తీవ్రత అంతగా ఉండడం లేదని వ్యాధి త్వరితగతిన అదుపులోకి వస్తోందని వైద్యాధికారులు చెబుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా కర్నూలు, నంద్యాల, విశాఖపట్నం, తిరుపతి, కాకినాడ జిల్లాల్లో మాత్రమే డెంగ్యూ కేసులు అధికంగా నమోదవుతున్నాయని అధికారికంగా ప్రభుత్వం ప్రకటించింది. ఇంటి చుట్టుపక్కల దోమలు ఉత్పత్తి అయ్యే నీటి నిల్వలు ఉన్నాయేమో చూడడంతోపాటు నీటి నిల్వలను శుభ్రం చేసి నీరు నిల్వ ఉండే తొట్టెలు, డబ్బాలు వంటి వాటిపై మూతలు ఉంచితే దోమలు వ్యాపించవు. తద్వారా డెంగ్యూ వ్యాధిని నివారించవచ్చు. ఇక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లావ్యాప్తంగా 2023లో 84 డెంగ్యూ కేసులు నమోదుకాగా, 2024లో అత్యధికంగా 239 డెంగ్యూలు కేసులు నమోదయ్యాయని అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ఈ ఏడాది జనవరి నెల నుంచి ఇప్పటివరకు 11 కేసులు మాత్రమే నమోదయ్యాయని సంబంధిత అధికారులు చెబుతున్నారు. అయితే ప్రైవేటు ఆసుపత్రుల్లో చేసిన పరీక్షలు పరిగణనలోకి తీసుకోబోమని, ఆ పరీక్షలతో డెంగ్యూ నిర్ధారణ కాదని మాక్-ఎలీసా పరీక్షే డెంగ్యూ నిర్ధారణగా భావించవచ్చని ఆరోగ్యశాఖ స్పష్టం చేస్తోంది.

డెంగ్యూ వ్యాధి లక్షణాలు..

డెంగ్యూను పరిశీలిస్తే.. సాధారణంగా మన ఇళ్ల పరిసరాల్లో ఆనాఫిలస్, క్యూలెక్స్, ఏడిస్, మాన్సోనియా అర్మిజరిస్ దోమలు పెరుగుతాయి. డెంగ్యూ అనేది వైరల్ జ్వరం, ఇది ఏడిస్ అనే దోమకాటు వల్ల వ్యాపిస్తుంది. ఈ ఏడిస్ దోమ ముఖ్యంగా పగటిపూట కుట్టే దోమ. ఒక్కసారిగా అధిక జ్వరం, తలనొప్పి, కంటివెనుక భాగంలో నొప్పి, కండరాలు నొప్పులు, జుట్టు ఊడిపోవడం, చర్మంపై గుండ్రటి ఎర్రమచ్చల లక్షణాలు కనిపిస్తాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో అమలాపురం సెంటినల్‌సైట్ హాస్పటల్, రామచంద్రాపురం ఏరియా ఆసుపత్రుల్లో మాత్రమే డెంగ్యూ నిర్ధారణ పరీక్షా కేంద్రాలు ఉన్నాయి. అలాగే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఈ రెండిటితోపాటు కాకినాడ, రాజమహేంద్రవరం ప్రధాన ప్రభుత్వ ఆసుపత్రులు (జీజీహెచ్‌లు), తుని ఏరియా ఆసుపత్రిల్లో డెంగ్యూ నిర్ధారణ కేంద్రాలు ఉన్నాయి. రోగి రక్త నమూనాలను మొదట ఎన్ఎస్-1 కిట్ ద్వారా పరీక్ష నిర్వహిస్తారు. వ్యాధి జాడలు కనిపిస్తే నిర్ధారణ కోసం మాక్-ఎలీసా పరీక్ష నిర్వహించి వ్యాధిని నిర్ధారిస్తారు. అయితే ప్రైవేటు ల్యాబ్‌ల్లో నిర్వహించే పరీక్షలు మాత్రం డెంగ్యూ నిర్ధారణ కాదని జిల్లా వైద్యాధికారులు స్పష్టం చేస్తున్నారు. ఒకవేళ ప్రైవేటు ఆసుపత్రుల్లో డెంగ్యూ సూచనలు కనిపిస్తే డీఎంఅండ్‌హెచ్‌వో, డీఎంవో స్థాయి అధికారుల పర్యవేక్షణలో నిర్ధారణ చెయ్యవల్సిందే.



పి.గన్నవరం మండలంలో చేస్తున్న జ్వర సర్వే

డ్రైడే ఫ్రైడేతో మంచి ఫలితాలు

ప్రతి శుక్రవారం గ్రామాల్లో నిర్వహించే డ్రైడేఫ్రైడే కార్యక్రమం మంచి ఫలితాలిస్తోంది. గ్రామస్థాయిలో వైద్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి వ్యాధులపై అవగాహన కల్పిస్తున్నారు. అలాగే సీజనల్ వ్యాధులపై ఎప్పటికప్పుడు జ్వర సర్వేలను నిర్వహించి తగు సూచనలు చేస్తున్నాం. అలాగే పరిశీలన, శుభ్రంచేయడం, మూతలు పెట్టడం ద్వారా దోమలు నివారించవచ్చు. జిల్లాలో ఇప్పటివరకు 11 డెంగ్యూ కేసులు మాత్రమే నమోదయ్యాయి. **- నక్కా వెంకటేశ్వరావు, జిల్లా మలేరియా అధికారి**

దోమల నివారణకు చర్యలు..

- ఇంటి పరిసరాల్లో నీరు నిలవకుండా చూసుకోవాలి.
- నీరు నిలువ చేయడం తప్పనిసరి అయితే అందులో వారానికి ఒకసారి కిరోసిన్ ఆయిల్ లేక వాడిన ఇంజన్ ఆయిల్ చల్లితే దోమలు వ్యాప్తి చెందవు.
- ఇంటి పరిసరాల్లో పనికిరాని తొట్లు, డబ్బాలు, టైర్లు, కొబ్బరి చిప్పలు వంటి వస్తువులు ఉండకుండా చూసుకోవాలి.
- గంబుషియా, గప్పి అనే చిన్న చిన్న చేపలను బావులు, కుంటలు వంటి వాటిలో వదిలితే నీటిలో ఉన్న దోమ లార్వాలను ఈ చేపలు తిని బతుకుతాయి. తద్వారా దోమలు పుట్టుక ఉండదు.
- ఇంటి పైకప్పులో ఉన్న ట్యాంకులకు మూతలు అమర్చాలి. లేకపోతే గుడ్లు పెట్టి పెరుగుతాయి.

దోమకాటు నుంచి రక్షణ కోసం..

- దోమకాటు నుంచి రక్షణకు దోమతెరలు వాడాలి.
- ఇంటి కిటికీలకు మెస్ అమర్చాలి.
- పొడవాటి దుస్తులను ధరించాలి. దోమలను చంపే క్రీములు, స్ప్రేలు వాడాలి. ఇళ్లల్లో క్రిమిసంహారక మందులను పిచికారి చెయ్యాలి.

టాప్ టెన్‌లో..

- ఉమ్మడి జిల్లాలోని వైద్య, ఆరోగ్యశాఖలకు ఉత్తమ ర్యాంకులు
- రాష్ట్రస్థాయిలో తూర్పు గోదావరికి రెండో స్థానం
- ఏడు, పది స్థానాల్లో నిలిచిన కోనసీమ, కాకినాడ జిల్లాలు

2, 7, 10.. ఇవీ రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మన ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖలకు కేటాయించిన ర్యాంకులు. వివిధ అంశాలను పరిగణనలోకి తీసుకుంటూ ఈ ర్యాంకులను ప్రకటించింది. ఇందులో టాప్ టెన్‌లో తూర్పుగోదావరి రెండో స్థానంలో, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఏడో స్థానంలో, కాకినాడ జిల్లా పదో స్థానంలో నిలిచాయి.

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పనితీరు, మాతా-శిశు ఆరోగ్యం తదితర 11అంశాల్లో రాష్ట్రంలో కాకినాడ జిల్లా పదో స్థానంలో నిలిచింది. ఈ మేరకు రాష్ట్ర వైద్య, ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ రెండు రోజుల క్రితం ర్యాంకులు వెల్లడించింది. 2024-25 సంవత్సరానికి సంబంధించిన సమాచారం ఆధారంగా వీటిని కేటాయించారు. మొత్తం వంద మార్కులకు కాకినాడ జిల్లాకు 80.08, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు 81.32, తూర్పుగోదావరి జిల్లాకు 82.63 వచ్చాయి. రాష్ట్రంలో తూర్పుగోదావరి జిల్లా రెండు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఏడు, కాకినాడ జిల్లా పది స్థానాల్లో నిలిచాయి.

మార్కులు ఇలా..

మొత్తం 12 అంశాలను పరిగణలోకి తీసుకుని మార్కులువేశారు. ఒక్కో అంశానికి పది మార్కులు, మరికొన్ని అంశాలకు ఐదేసి మార్కుల చొప్పున ఈ ర్యాంకులను కేటాయించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పనితీరుకు మొత్తం పది మార్కులు కేటాయించగా కాకినాడజిల్లాకు 6.93 మార్కులు వచ్చాయి. 3.07 మార్కులు తగ్గాయి. వీటి పనితీరు కాస్త పర్వాలేదనిపిస్తోంది. మాతా-శిశుఆరోగ్యానికి 25 మార్కులకు కాకినాడ జిల్లాకు 21.89, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు 21.88, తూర్పుగోదావరిజిల్లాకు 22.56 వచ్చాయి. ఎన్‌యూహెచ్‌ఎం, వ్యాధుల నియంత్రణ, డీసీహెచ్ఎస్‌కు 25 మార్కులకు కాకినాడ జిల్లాకు 24.10, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు 22.58, తూర్పుగోదావరి జిల్లాకు 22.22 వచ్చాయి. కుటుంబనియంత్రణ, ఆరోగ్యసముదాయానికి సంబంధించి ఐదు మార్కులకు కేవలం 1.86 మార్కులే కాకినాడ జిల్లాకు వచ్చాయి. ఈ విషయంలో వెనుకబడే ఉంది. ఎచ్‌డబ్ల్యూసీకి సంబంధించి మొత్తంపది మార్కులకు కాకినాడ జిల్లాకు 9.8, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు 9.83, తూర్పుగోదావరి జిల్లాకు 9.97 వచ్చాయి. ఆభ, ఎఫ్ఆర్ఎస్‌కు సంబంధించి మొత్తం ఆరు మార్కులకు కాకినాడ జిల్లాకు 5.08, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు 5.08, తూర్పుగోదావరి జిల్లాకు 5.12 వచ్చాయి.

ర్యాంకింగ్ సంతృప్తికరమే..



రాష్ట్ర వైద్య, ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ విడుదల చేసిన ర్యాంకింగ్‌లో టాప్ టెన్‌లో నిలవడం సంతృప్తినిచ్చింది. మొత్తం మూడు కేటగిరీల్లో ఈ ర్యాంకులను ప్రకటించారు. ప్రస్తుతం గుడ్ పెర్ఫార్మెన్స్ కేటగిరీలోనే కాకినాడజిల్లా ఉంది. కేవలంరెండు, మూడు మార్కుల తేడాలోనే ర్యాంకులు మారాయి. మన జిల్లాకు సంబంధించి కుటుంబ నియంత్రణ, కౌమార బాలిక ఆరోగ్యానికి సంబంధించి ఐదుమార్కులకు 1.86, క్వాలిటీ ఎస్యూరెన్స్‌కు సంబంధించి నాలుగు మార్కులకు 1.20 వచ్చాయి.

-డాక్టర్ జె.నరసింహనాయక్, డీఎంహెచ్‌వో, కాకినాడ జిల్లా

డెల్టా రూపశిల్పి కాటన్ దొరకు ఘన నివాళి



కాటన్ దొరకు పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఇరిగేషన్ అధికారులు

ధవళేశ్వరం, మే 15 (ఆంధ్రజ్యోతి): డెల్టా రూపశిల్పి, గోదావరి జిల్లాలను ఆంధ్ర అన్నపూర్ణగా మార్చిన సర్ ఆర్థర్ కాటన్ 222వ జయంతిని ఘనంగా నిర్వహించారు. గురువారం ఉదయం కాటన్ బ్యారేజ్ ముఖద్వారం వద్ద ఉన్న కాటన్‌దొర విగ్రహానికి డెల్టా చీఫ్ ఇంజనీర్ ఆర్.శ్రీరామకృష్ణ, ఇరిగేషన్ సర్కిల్ ఎస్ఈ కె.గోపీనాథ్, ఇతర సిబ్బంది పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డీఈ ఆనంద్‌బాబు, ఏఈలు అద్దంకి సాయిరాం, రాధాకృష్ణ, సునీల్ పాల్గొన్నారు.

- ధవళేశ్వరంలోని కాటన్ స్మృతి వనంలో కాటన్‌దొర విగ్రహానికి డీసీసీబీ మాజీ చైర్మన్ ఆకుల వీర్రాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలుగు ప్రజలు గుండెల్లో ఆయన చిరస్మరణీయుడుగా ఉంటారన్నారు. కార్యక్రమంలో గరగ శ్రీనివాసరావు, మోర్త పావనమూర్తి, శ్రీరంగంబాలరాజు, పులపర్తి కిషోర్ పాల్గొన్నారు.

ఘనంగా 222వ జయంతి వేడుకలు

- గోదావరి నదిపై ఆనకట్ట కట్టి అసాధ్యాన్ని సుసాధ్యం చేసిన కాటన్‌దొర ఆంధ్రుల పాలిట అన్నదాత అయ్యారని కూటమి నాయకులు కొనియాడారు. కాటన్ స్మృతి వనంలోని కాటన్ దొర విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పండరి అప్పారావు, యడ్లమహేష్, నీలి కోటేశ్వరరావు, బీరా ప్రకాష్, రెహ్మాన్‌ఖాన్, దారపు శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.
- కాటన్ దొర జయంతిని పురస్కరించుకుని బీఎస్ కెమికల్స్ అధినేత బీఎస్ ప్రసాద్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. కపిలేశ్వరపురానికి చెందిన ఈయన నాలుగేళ్లుగా కాటన్‌పై అభిమానంతో ఏర్పాటుచేస్తున్నారు.

మన్యంలో చైల్డ్ ఆర్టిస్ట్ భానుప్రకాష్ సందడి

మోతుగూడెం, మే 15 (ఆంధ్రజ్యోతి): చింతూరు మండలం మోతుగూడెం పరిధిలో చైల్డ్ ఆర్టిస్ట్ భానుప్రకాష్ సందడి చేశాడు. పర్యాటక ప్రదేశాలైన ధారాలమ్మగుడి పిక్నిక్ స్పాట్, పొల్లూరు జలపాతం, పుష్ప షూటింగ్, బ్రిడ్జి ఫోర్‌బై రిజర్వాయర్ వద్ద పర్యటించి సందడి చేశాడు. ఈ సందర్భంగా భానుప్రకాష్ 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ.... తాను తండేల్, కింగ్డమ్, హరికథ, కేజీఎఫ్-2, యక్షిణి, గమనం, విమానం, అంబాజీపేట మ్యారేజ్ బ్యాండ్, లవ్‌స్టోరీ, సరిలేరు నీకెవ్వరు, వెంకీమామ, కథానాయకుడు, మిస్టర్ మజ్ను, ఒకక్షణం వంటి 60 సినిమాల్లో చైల్డ్ ఆర్టిస్టుగా నటించానని, అందులో కొన్ని ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చాయని తెలిపాడు. సినిమాల్లోనే కాకుండా టీవీ షోలు, సీరియళ్లు, నాటకాలు వంటి ఇతర రంగాల్లోను నటనతో రాణిస్తూ గుర్తింపు తెచ్చుకుంటున్నాడు. తన తండ్రి సురేష్ కూడా సినిమా రంగానికి చెందిన వాడేనని, ఆయన 30కిపైగా లఘు చిత్రాల్లో చేశాడని తెలిపాడు. తాను హార్ట్‌బీట్ అనే ఇండిపెండెంట్ సినిమా కూడా చేశానని తెలిపాడు.



భానుప్రకాష్



సీ పోర్టు సమీపంలో కంటైనర్ కేంద్రాన్ని ప్రారంభించిన కస్టమ్స్ అసిస్టెంట్ కమిషనర్ రవికుమార్

కాకినాడలో కంటైనర్ ఫ్రైట్ స్టేషన్

- కార్గోల ఎగుమతి, దిగుమతులకు అందుబాటులోకి కేంద్రం
- ప్రారంభించిన కస్టమ్స్ అసిస్టెంట్ కమిషనర్ రవికుమార్

కాకినాడ సిటీ, మే 15 (ఆంధ్రజ్యోతి): కాకినాడ పోర్టు నుంచి విదేశాలకు వివిధ రకాల కార్గోల ఎగుమతి, దిగుమతులకు కంటైనర్ కేంద్రం అందుబాటులోకి వచ్చింది. కంటైనర్ ఫ్రైట్ స్టేషన్‌ను కాకినాడ కస్టమ్స్ అసిస్టెంట్ కమిషనర్ కె.రవికుమార్ గురువారం ప్రారంభించగా కాకినాడ సీ పోర్టు చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ మురళీధర్, శ్రావణ్ గ్రూప్ ఎండీ జి.సాంబశివరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కస్టమ్స్ అసిస్టెంట్ కమిషనర్ రవికుమార్ మాట్లాడుతూ కొత్తగా ఏర్పాటైన ఈ కంటైనర్ ఫ్రైట్ స్టేషన్‌తో కాకినాడ పారిశ్రామికంగా మరింత ఎదగనుందన్నారు. ప్రస్తుతం ఇటువంటి కంటైనర్ ఫ్రైట్ స్టేషన్లు విశాఖలో పది ఉన్నాయన్నారు. కాకినాడలో షిప్పింగ్ ఆధారిత వ్యాపారం మరింత పుంజుకోనుందని తెలిపారు. వ్యాపారులు కంటైనర్ ఎగుమతుల కోసం చెన్నై, విశాఖ వెళ్లక్కర్లేకుండా ఇక్కడి నుంచే విదేశాలకు ఎగుమతులు చేయవచ్చని వివరించారు. ఈ కేంద్రం ఆక్వా, ఫార్మా, రైస్, రా షుగర్ దిగుమతికి ఉపయోగపడుతుందన్నారు.

కాకినాడ సీ పోర్టు చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ మురళీధర్ మాట్లాడుతూ ఎగుమతుదారులకు సరైన సదుపాయాలు లేక కాకినాడలో కంటైనర్ వ్యాపారం చాలా తక్కువగా జరుగుతోందన్నారు. ఈ కేంద్రం రాకతో అన్ని షిప్పింగ్ కంపెనీలు త్వరలో కార్యకలాపాలు మొదలుపెడతాయన్నారు. ఫ్రైట్ స్టేషన్ ఏర్పాటుకు మొదట్లో చాలా పెట్టుబడి పెట్టాల్సి ఉంటుందన్నారు. పోర్టు, కస్టమ్స్, ఫ్రైట్ స్టేషన్ కలిసి కాకినాడ పారిశ్రామికంగా అభివృద్ధి చెందేలా తోడ్పాటు అందిస్తామన్నారు. ప్రధానంగా బియ్యం ఎగుమతులకు కంటైనర్లు చాలా ఉపయోగమన్నారు.

శ్రావణ్ గ్రూప్ ఎండీ సాంబశివరావు మాట్లాడుతూ కాకినాడలో తాము ఏర్పాటుచేసిన కంటైనర్ కేంద్రం ఎగుమతులకు ఎంతోగానే కలిసివస్తుందన్నారు. పది ఎకరాల్లో ఏర్పాటు చేసిన ఈ కేంద్రం ద్వారా ఒకేసారి మూడువేల కంటైనర్లను హ్యాండిల్ చేయవచ్చన్నారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో 2004లో తమ సంస్థ తొలి సీఎఫ్ఎస్ ఏర్పాటు చేసిందన్నారు. ఆ తర్వాత మరొకటి ఏర్పాటు చేయగా మూడోది కాకినాడలో ఏర్పాటు చేశామని వివరించారు. కార్యక్రమంలో కస్టమ్స్ అధికారులు, షిప్పింగ్ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.



కాకినాడ జిల్లా కొత్తపల్లిలో...

వికసించిన 'మే' పుష్పాలు

కొత్తపల్లి, మే 15 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కొత్తపల్లికి చెందిన కాకరపల్లి గంగాధర శ్రీనివాసరావు ఇంటి ప్రాంగణంలో 'మే' పుష్పాలు వికసించాయి. గతంలో ఒకటి లేక రెండు పూసేవని, ఈసారి ఏకంగా నాలుగు వికసించాయని చెప్పారు.

కాట్రేనికోన (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన యాదవుల వీధిలో మట్టపర్తి అనంతలక్ష్మి ఇంటి పెరట్లో మూడు మే పుష్పాలు వికసించాయి. 15 ఏళ్ల నుంచి పూలు పూస్తున్నట్టు ఆమె చెప్పారు.



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోనలో...



తల్లిదండ్రులు సుహాన్‌బీబీ, యాకూబ్‌లతో అబ్దుల్ రజాక్

పేదింట విరిసిన విద్యా కుసుమం

ఏపీ ఈసెట్ కెమికల్ ఇంజనీరింగ్ విభాగంలో అబ్దుల్ రజాక్‌కు రాష్ట్రస్థాయిలో రెండో ర్యాంకు

రామచంద్రపురం (ద్రాక్షారామ), మే 15 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం పట్టణానికి చెందిన అబ్దుల్ రజాక్ ఏపీ ఈసెట్‌లో కెమికల్ ఇంజనీరింగ్ విభాగంలో 121 మార్కులతో రాష్ట్రస్థాయిలో 2వ ర్యాంకు సాధించాడు. రజాక్ ఎల్‌కేజీ నుంచి పదో తరగతి వరకు స్థానిక సన్ షైన్ ఇంగ్లిషు మీడియం స్కూలో చదివాడు. పదో తరగతిలో 589 మార్కులు సాధించగా ఐఐటీ చదవాలన్న అతడి లక్ష్యానికి పేదరికం అడ్డువచ్చింది. తండ్రి షేక్ యాకూబ్ టైలరింగ్ షాపులో పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. తల్లి సుహాన్‌బీబీ సహేబా గృహిణి. కొద్ది కాలం ప్రైవేటు పాఠశాలలో పనిచేసింది. ఇంటర్ కార్పొరేట్ కళాశాలలో చదివించే స్థోమత లేకపోవడంతో పాలిటెక్నిక్ ఎంట్రన్స్ రాయగా విశాఖలోని కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో కెమికల్ ఇంజనీరింగ్ బ్రాంచిలో సీటు వచ్చింది. తల్లిదండ్రులు విశాఖలో అద్దె ఇంట్లో ఉంటూ రజాక్‌ను మూడున్నర ఏళ్ల పాలిటెక్నిక్ చదివించారు. రాష్ట్రస్థాయిలో రెండో ర్యాంకు రావడంతో వారు సంతోషం వ్యక్తం చేశారు. అబ్దుల్ రజాక్ మీడియాతో మాట్లాడుతూ జేఎన్టీయూలో బీటెక్ కెమికల్ ఇంజనీరింగ్ పూర్తి చేస్తానన్నాడు. ఎంబీఏ చేసి పారిశ్రామికవేత్తగా ఎదగాలన్నదే తన జీవిత లక్ష్యమని వివరించాడు.

8,586 విద్యుత్ కేసులు పరిష్కారం



విద్యుత్ సమస్యల పరిష్కార వేదికలో అర్జీలు స్వీకరిస్తున్న సీజీఆర్ఎఫ్ చైర్మన్ సత్యనారాయణ

- వినియోగదారులకు రూ.14 లక్షలు పరిహారం
- సీజీఆర్ఎఫ్ చైర్మన్ సత్యనారాయణ

కరప, మే 15 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ పరిధిలోని 11 జిల్లాల నుంచి విద్యుత్ సమస్యలకు సంబంధించి 8,748 కేసులు రాగా వాటిలో ఇప్పటివరకు 8,586 కేసులను పరిష్కరించినట్టు సీజీఆర్ఎఫ్ చైర్మన్ డాక్టర్ బి.సత్యనారాయణ తెలిపారు. కాకినాడ జిల్లా కరప విద్యుత్ ఉప కేంద్రం ఆవరణలో గురువారం నిర్వహించిన విద్యుత్ సమస్యల పరిష్కార వేదికలో ఆయన మాట్లాడారు. విద్యుత్ సమస్యలు ఎదురైతే వినియోగదారులు సమీప అసిస్టెంట్ ఇంజనీర్ కార్యాలయంలో గానీ లేదా 1912 టోల్ ఫ్రీ నెంబర్‌కు కాల్ చేయాలని, 60రోజుల్లో పరిష్కారం చూపకపోతే సంబంధిత అధికారుల నుంచి నష్టపరిహారం అందించేలా చూస్తామన్నారు. ఇలా ఇప్పటివరకు 108 కేసుల్లో అధికారులను బాధ్యులను చేస్తూ వారి నుంచి వినియోగదారులకు రూ.14,36,956 పరిహారంగా చెల్లించామన్నారు. ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్ల వరకు, వ్యవసాయానికి 9 గంటలు ఉచిత విద్యుత్ సదుపాయం ఉందన్నారు. విద్యుత్ సమస్యలపై సంబంధిత అధికారులు పట్టించుకోకపోతే సీజీఆర్ఎఫ్‌ను సంప్రదించి న్యాయం పొందాలని సూచించారు. విద్యుత్ ప్రమాదాలకు గురై మరణించిన, అంగవైకల్యం పొందిన వారికి సంస్థ నుంచి పరిహారం అందుతుందన్నారు. ఈ విషయంలో అధికారులు సకాలంలో స్పందించకపోతే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని సిఫార్సు చేసే అధికారం సీజీఆర్ఎఫ్‌కు ఉందని స్పష్టం చేశారు. అనంతరం వినియోగదారుల నుంచి 11 అర్జీలు స్వీకరించి వాటి సత్వర పరిష్కారానికి చొరవ తీసుకోవాలని అధికారులకు సూచించారు. సీజీఆర్ఎఫ్ ఫైనాన్స్ మెంబర్ సలాది సుబ్బారావు, ఇండిపెండెంట్ మెంబర్ ఎస్.మురళీకృష్ణ, విద్యుత్ శాఖ డీఈ తుమ్మలపల్లి విష్ణుమూర్తి, ఏఈ సానా ఈశ్వరప్రసాద్, జేఈ వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.


కాకినాడలో కురుస్తున్న భారీ వర్షం


కోనసీమ జిల్లా అంబాజీపేటలో ఈదురుగాలులతో కూడిన వర్షం

వచ్చింది..వాన!

ప్రస్తుతం మండుతున్న ఎండలకు ప్రజలు అల్లాడిపోతున్నారు. వర్షం కురిస్తే బాగుండును వాతావరణం చల్లగా మారుతుందని ఆశపడుతున్నారు. అయితే గురువారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పలుచోట్ల వర్షం పడి ఉపశమనం పొందారు.


కాకినాడ వర్షంలో వాహనదారులు

రోడ్డు ప్రమాదంలో బాలిక దుర్మరణం

బాలిక పై నుంచి వెళ్లిన ధాన్యం లోడు ట్రాక్టర్

రాయవరంలో ఘటన

రాయవరం, మే 15(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయవరంలో గురువారం జరిగిన రోడ్డుప్రమాదంలో 13 ఏళ్ల బాలిక దుర్మరణం చెందింది. వివరాలు ఇలా ఉన్నాయి. తూర్పుగోదావరి జిల్లా అనపర్తి మండలం మహేంద్రవాడకు చెందిన పాలపర్తి నాగవర్షిణి (13) తన సమీప బంధువుతో కలిసి బైక్‌పై రాయవరంలో ఉన్న బంధువుల ఇంటికి గురువారం వచ్చింది. బంధువులు ఇంటి నుంచి తిరిగి మహేంద్రవాడకు ద్విచక్రవాహనంపై వస్తుండగా రాయవరంలో ధాన్యంలోడ్ ట్రాక్టర్‌ను తప్పించబోయే సమయంలో బైక్ అదుపుతప్పి ఇద్దరు కిందపడిపోయారు. ఆ సమయంలో వెనక కూర్చున్న బాలికపై నుంచి ధాన్యం లోడు ట్రాక్టర్ వెళ్లిపోవడంతో నాగవర్షిణి కాళ్లు నుజ్జునుజ్జయ్యాయి. బాలికను స్థానికులు హుటాహుటిన 108సాయంతో రామచంద్రపురం ఏరియా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే బాలిక మృతిచెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. మండపేట ప్రభుత్వాసుపత్రిలో శవపంచనామా నిర్వహించిన అనంతరం బంధువులకు బాలిక మృతదేహాన్ని అప్పగిస్తామని రాయవరం ఎస్‌ఐ సురేష్‌బాబు తెలిపారు. మృతురాలి తండ్రి పాలపర్తి వీరవెంకటసతన్నా రాయణ గ్రామరెవెన్యూ సహాయకుడిగా పనిచేస్తున్నారు. ఆయన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు. ఇదిలాఉండగా నాగవర్షిణి 5 వతరగతి చదువుతుంది. మృతురాలి సోదరి ఓణీల వేడుక రెండు రోజుల క్రితమే నిర్వహించారు. కుటుంబసభ్యులు, బంధువుల మధ్య ఆనందంగా జరిగిన వేడుకను మరువకముందే ఈ సంఘటన జరగడంతో వారు జీర్ణించుకోలేకపోతున్నారు. సంఘటనా స్థలానికి మండపేట రూరల్ సీఐ పితల దొరరాజు చేరుకుని ప్రమా దంపై ఆరా తీశారు.


సంఘటనా స్థలంలో బాలిక

పిడుగుపడి కౌలు రైతు మృతి


బాలకృష్ణ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు

కాజులూరు (కరప), మే 15 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కాజులూరు మండలం జగన్నాథగిరి గ్రామంలో గురువారం సాయంత్రం పిడుగు పడి ఒక కౌలు రైతు మృతి చెందాడు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం కపిలేశ్వరపురం గ్రామానికి చెందిన బుకే బాలకృష్ణ (35) రామచంద్రపురం మండలం కాపవరంలోని అత్తగారి ఇంటి వద్ద ఉంటూ కౌలు రైతుగా జీవనం సాగిస్తున్నాడు. కాజులూరు మండలం పెనుమళ్ల గ్రామానికి చెందిన సలాది రాంబాబు అనే రైతుకు చెందిన రెండెకరాల భూమిని కౌలుకు తీసుకుని సాగుచేస్తున్నాడు. గురువారం సాయంత్రం చేలో పని ముగించుకున్న బాలకృష్ణ తిరిగి కాపవరం వెళ్తుండగా భారీ వర్షం కురుస్తుండడంతో జగన్నాథగిరి గ్రామ సమీపంలో ఆగాడు. అదే సమయంలో అతడిపై పిడుగు పడడంతో ఘటనా స్థలంలోనే కుప్పకూలి మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. జగన్నాథగిరి వీఆర్వో ఈశ్వర సత్యనారాయణ ఇచ్చిన రిపోర్టు మేరకు గొల్లపాలెం పోలీసులు విచారణ చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. బాలకృష్ణ మృతితో కుటుంబసభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహం వద్ద బోరున విలపించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ ఎం.మోహన్‌కుమార్ తెలిపారు.

గోదావరిలో గుర్తుతెలియని మృతదేహాలు లభ్యం

కొవ్వూరు, మే 15 (ఆంధ్రజ్యోతి): గోదావరి నదిలో గుర్తుతెలియని మృతదేహాన్ని గుర్తించినట్టు కొవ్వూరు పోలీసులు తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరులోని ఔరంగాబాద్-2 ఇసుకర్యాంపులో నదిలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం ఉందని స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో అక్కడికి చేరుకున్న మృతదేహాన్ని బయటకు తీయించారు. పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి వయస్సు సుమారు 50ఏళ్లు ఉంటుందని, దేహంపై వైట్ కలర్ కట్ బనియన్, నలుపురంగు షార్ట్ ఉన్నాయని, ఆచూకీ తెలిసినవారు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో లేదా 9440796622, 9492482056లో సమాచారం అందించాలన్నారు. దీనిపై కేసునమోదు చేసినట్టు సీఐ తెలిపారు.

అలాగే పట్టణంలోని ఆరికిరేవుల రోడ్‌లోని దండకుం ట పుంత ఇసుకర్యాంపులో గామన్ బ్రిడ్జి కింద గోదావరి నదిలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం తేలుతుందని స్థానికులు పోలీసులకు సమాచారం అందజేశారు. పోలీసులు మృతదేహాన్ని నది నుంచి బయటకు తీయించారు. పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి వయస్సు సుమారు 40 ఏళ్లు ఉంటుందని, ఒంటిపై నీలం, తెలుపురంగుల గడుల షర్ట్, నీలంరంగు ప్యాంటు ఉన్నాయన్నారు. ఆచూకీ తెలిసినవారు సమాచారం అందించాలని, కేసు నమోదు చేసినట్టు సీఐ పేర్కొన్నారు.

చీటింగ్ కేసులో సర్పంచ్ భర్త అరెస్ట్

తొండంగి, మే 15 (ఆంధ్రజ్యోతి): ముగ్గురి నుంచి రూ.17.5 లక్షల మొత్తాన్ని కాకినాడ జిల్లా తొండంగి మండలం కోదాడ సర్పంచ్ బూర్తి రత్న కుమారి భర్త నాని చీటింగ్ చేసి కాజేసినట్టు వచ్చిన ఫిర్యాదుపై గురువారం కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు తొండంగి ఎస్‌ఐ జగన్మోహన్ పేర్కొన్నారు. వివరాల ప్రకారం.. కోదాడ గ్రామానికి చెందిన నొక్కు సూర్యనారాయణ మరో ఇద్దరికి ఎస్ఈజెడ్‌లో భూములు పోయినందుకు వచ్చిన పరిహారాన్ని నాని కాజేసినట్టు సూర్యనారాయణ ఫిర్యాదు చేశాడు. కొంతమొత్తం ఇచ్చి మిగిలిన మొత్తానికి ఖాళీ చెక్కులపై బెదిరించి బలవంతంగా సంతకాలు చేయించుకుని రూ.17.5 లక్షల సొమ్మును కాజేశాడన్నారు. పెద్దాపురం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో ఖాతా ఓపెన్ చేయించి ఆ మొత్తాన్ని కాజేసినట్టు ఆధారాలతో సూర్యనారాయణ ఫిర్యాదు చేశాడన్నారు. విచారణ జరిపి నానిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించిందన్నారు.

సామర్లకోట చైర్‌పర్సన్ పదవికి రాజీనామా

▸ కోర్టును ఆశ్రయించినా సమావేశాన్ని అడ్డుకోలేకపోయిన అరుణ

▸ అవిశ్వాస తీర్మాన సమావేశానికి 25 మంది వైసీపీ కౌన్సిలర్లు హాజరు


రాజీనామా లేఖను సామర్లకోట మున్సిపల్ కమిషనర్‌కు అందజేస్తున్న చైర్‌పర్సన్

సామర్లకోట, మే 15 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట మున్సిపల్ చైర్‌పర్సన్ జి.అరుణ (వైసీపీ)పై సొంత పార్టీ కౌన్సిలర్లు అవిశ్వాసం ప్రకటిస్తూ కలెక్టర్‌కు లేఖ ఇచ్చిన నేపథ్యంలో ప్రత్యేకాధికారి మల్లిబాబు సమక్షంలో గురువారం కౌన్సిల్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. దీంతో ఏకాకి అయిన చైర్‌పర్సన్ అరుణ గత్యంతరం లేని పరిస్థితుల్లో తన పదవికి రాజీనామా లేఖను సమావేశానికి గంట ముందుగా కమిషనర్ శ్రీవిద్యకు అందజేశారు. అప్పటికే ప్రత్యేక సమావేశం నిర్వహణకు అన్ని ఏర్పాట్లను అధికార యంత్రాంగం సిద్ధం చేసింది. ఇక తనకు ఓటమి తప్పదని భావించిన చైర్‌పర్సన్ అరుణ రాజీనామా లేఖను అందజేశారు. ఇప్పటికే సమావేశం నిర్వహించకుండా అడ్డుకునేందుకు చైర్‌పర్సన్ కోర్టులను సైతం ఆశ్రయించినప్పటికీ సమావేశం నిర్వహించేందుకు ఎటువంటి అడ్డంకులు లేకపోవడంతో గురువారం ముందుగా ఊహించిన రీతిలోనే సమావేశం నిర్వహించారు. అందరూ ఊహించినట్లు అవిశ్వాసానికి అనుకూలంగా 25 మంది కౌన్సిలర్లు చేతులెత్తి మద్దతు తెలిపారు. సమావేశానికి ప్రిసైడింగ్ అధికారిగా వ్యవహరించిన మల్లిబాబు కౌన్సిలర్లను లెక్కించారు. తదనంతరం విలేకర్లతో మాట్లాడుతూ చైర్‌పర్సన్ కోర్టును ఆశ్రయించడంతో ఫలితాన్ని వెల్లడించడంలేదని చెప్పారు.

అందుకే అవిశ్వాసం ప్రకటించాం

మూడు నెలలు మాత్రమే చైరపర్సన్ పదవిలో కొనసాగేందుకు ముందుగా పార్టీ నాయకులు నిర్దేశించినప్పటికీ ఊహించని రీతిలో నాలుగేళ్ల పాటు పదవిలో కొనసాగిన చైర్‌పర్సన్ అరుణ సొంత పార్టీ కౌన్సిలర్లనే ఏమాత్రం లెక్కించకుండా ఏకపక్షధోరణి అవలంబించడం వల్లే కౌన్సిలర్లు అందరూ వ్యతిరేకించామని వైస్ చైర్మన్లు జాన్‌మోజెస్, గోకిన సునేత్రాదేవి, ఆవాల లక్ష్మీనారాయణ, పాగా సురేష్‌కుమార్, రెడ్నం సునీత, నేతల హరిబాబు పేర్కొన్నారు. కౌన్సిల్ ప్రత్యేక సమావేశం అనంతరం విలేకర్లతో వారు మాట్లాడుతూ పార్టీని, నాయకులను కించపరిచే రీతిలో చైర్‌పర్సన్ మాట్లాడడం దురదృష్టకరం అన్నారు. పార్టీ పలు దఫాలు చేసిన సూచనలు పెడచెవిన పెట్టారన్నారు. పార్టీ కార్యకలాపాలకు వ్యతిరేకంగా వ్యవహరించిన చైర్‌పర్సన్ అరుణను ఇప్పటికే పార్టీ అధిష్టానం సస్పెండ్ చేసిన విషయం అందరికీ తెలిసిందేనన్నారు. తదుపరి జరిగే కార్యక్రమాలకు పార్టీ అధిష్టానం సూచనల మేరకే తామంతా కలిసి పనిచేస్తామని, పట్టణాన్ని ప్రభుత్వ సహకారంతో అభివృద్ధి పథంలోక పయనింపజేస్తామని వారు చెప్పారు.

లారీ ఢీకొని మహిళ మృతి

కుమారుడి కళ్లెదుటే మరణించిన తల్లి


లారీ కింద సుధా మృతదేహం


ఫైల్‌ఫొటో

కొవ్వూరు, మే 15 (ఆంధ్రజ్యోతి): లారీ ఢీకొని కుమారుడి కళ్లెదుటే తల్లి మృతిచెందిన సంఘటన తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు పట్టణంలో జరిగింది. వివరాల్లోకి వెళ్తే కొవ్వూరు జగనన్నకాలనీ గుత్తావారి చెరువు లేఅవుట్-1లో నివాసం ఉంటున్న దూసనపూడి సుధా (46) నందమూరు రోడ్‌లోని యువరాజ్ ఫంక్షన్ హాల్ ఎదురుగా టైలరింగ్ షాపులో టైలరింగ్ చేస్తుంది. భర్త కృష్ణసాయి పాసింజర్ ఆటో నడుపుతుంటాడు. కుమార్తె శ్రీలత డిగ్రీ చదువుతుంది. కుమారుడు చరణ్ ఉన్నాడు. ప్రతిరోజు కాలనీ నుంచి భర్త లేదా కుమారుడు గాని మోటారుసైకిల్‌పై షాపు వద్దకు తీసుకొస్తుంటారు. రోజూ మాదిరిగా కుమారుడు చరణ్ గురువారం ఉదయం తల్లిని మోటారుసైకిల్‌పై తీసుకుని షాపునకు బయలుదేరాడు. గామన్‌బ్రిడ్జి సెంటర్ సమీపంలో దొమ్మేరురోడ్‌లో వేబ్రిడ్జి వద్దకు చేరుకునేసరికి వెనుక నుంచి వస్తున్న లారీ ఢీకొంది. దీంతో ఇద్దరు కిందపడిపోయారు. సుధ నడుము పై నుంచి లారీచక్రాలు ఎక్కడంతో నుజ్జునుజ్జు అయ్యి అక్కడికక్కడే మృతిచెందింది. చరణ్‌కు కుడి చెయ్యి, కుడికాలు, కుడి పాదానికి గాయాలు కావడంతో స్నేహితుడి సహాయంతో చికిత్స నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న వెంటనే పట్టణ సీఐ విశ్వం సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చరణ్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నట్టు సీఐ తెలిపారు.

‘నన్నయ’లో జూలై 14 నుంచి ఈఎఫ్‌డీపీ కార్యక్రమం


బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న నన్నయ వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ

వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ

దివాన్‌చెరువు, మే 15 (ఆంధ్రజ్యోతి): ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలోని ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో జూలై 15 నుంచి 19 వరకూ క్వాంటం టెక్నాలజీస్ అపర్చునిటీస్ అండ్ త్రెట్స్ అనే అంశంపై ఆఫ్‌లైన్ పద్ధతిలో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కార్యక్రమం నిర్వహిస్తున్నారని ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ తెలిపారు. దీనికి సంబంధించిన బ్రోచర్‌ను గురువారం వీసీ ఆవిష్కరించి వివరాలు తెలిపారు. అఖిలభారత సాంకేతిక విద్యామండలి (ఏఐసీటీఇ) ట్రైనింగ్ అండ్‌లెర్నింగ్ (ఏటీఏఎల్) నుంచి దీనికి అనుమతి లభించిందన్నారు. ఈ కార్యక్రమం ప్రస్తుతం ఇంజనీరింగ్ కళాశాలల్లో 2025-26 నుంచి మైనర్ డిగ్రీ వర్తింపచేసి అనుసరిస్తున్నవారికి చాలా ఉపయోగకరంగా ఉంటుందని చెప్పారు. దీనికి సంబంధించిన మరిన్ని వివరాలను విశ్వవిద్యాలయం వెబ్సైట్ నుంచి పొందవచ్చని తెలి పారు. ఈఎఫ్‌డీపీకి కోఆర్డినేటర్‌గా వి.పెర్సిస్, అసిస్టెంట్ కోఆర్డినేటర్‌గా జి.కీర్తి మరిట వ్యవహరిస్తారన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, ప్రిన్సిపల్ డాక్టర్ పి.వెంకటేశ్వరరావు, కోఆర్డినేటర్ వి.పెర్సిస్, అసిసెటంట్ కోఆర్డినేటర్ జి.కీర్తిమరిట పాల్గొన్నారు.

కాకినాడలో యువకుడి హత్య


కిరణ్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్‌డీపీవో మనీష్ దేవరాజ్‌పాటిల్

కాకినాడ క్రైం, మే 15 (ఆంధ్రజ్యోతి): వివాహేతర సంబంధం నేపథ్యంలో ఓ యువకుడు హత్యకు గురైన సంఘటన గురువారం కాకినాడలో జరిగింది. వివరాలిలా ఉన్నాయి. కాకినాడ ఏటిమొగకు చెందిన వాడ్రేవు బద్రీ కిరణ్ (20) ఐటీఐ చదివి ప్రస్తుతం ఖాళీగా ఉంటున్నాడు. తన పెంపుడు కుక్క అనారోగ్యంగా ఉండడంతో వైద్యం నిమిత్తం దానిని తీసుకుని తన స్నేహితుడైన పెసంగి శ్యామ్‌తో కలిసి బుధవారం కాకినాడ రామారావుపేటలోని వెటర్నరీ ఆసుపత్రికి తీసుకెళ్లాడు. అక్కడికి కిరణ్‌కు తెలిసిన పెమ్మాడి హరీష్, కోలా మహేష్ ఆటోలో వచ్చి అతడికి బలవంతంగా తీసుకునిపోయారు. అది చూసిన శ్యామ్ వెంటనే కిరణ్ తల్లి దుర్గకు ఫోన్ చేసి విషయం చెప్పాడు. ఆమె రాత్రి వరకు చుట్టుపక్కల వెతికి అనంతరం పోర్టు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోర్టు సీఐ మ్యాన్ మిస్సింగ్ కేసుగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. గురువారం కాకినాడ రూరల్ మండలం నేమాం సమీపంలోని ఎస్ఆర్ ఎంటీ చౌదరి ఘాట్ వద్ద సముద్రంలో బద్రీ కిరణ్ మృతదేహం తేలి ఉండడాన్ని స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే కాకినాడ ఎస్‌డీపీవో మనీష్ దేవరాజ్ పాటిల్, పోర్టు సీఐ సునీల్ కుమార్, సిబ్బంది సముద్ర తీరం వద్దకు చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు. మృతుడి ఛాతిపైన, గొంతుపైన తీవ్ర రక్తపు గాయాలు ఉండడంతో ముమ్మాటికీ హత్యేనని నిర్ధారించి మిస్సింగ్ కేసును హత్య కేసుగా మార్చి దర్యాప్తు చేస్తున్నారు. బద్రీ కిరణ్‌కు, పెమ్మాడి హరీష్ భార్యకు వివాహేతర సంబంధం నేపథ్యంలోనే మరో స్నేహితుడు కోలా మహేష్ సహాయంతో హరీష్ బీర్ బాటిల్ పగులగొట్టి ఈ హత్యకు పాల్పడినట్టు భావించి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తూరంగిలో చోరీ

సుమారు 160 గ్రాముల బంగారం, రూ.40,000 నగదు అపహరణ

కాకినాడ రూరల్, మే 15 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం వెలమల తూరంగిలో చోరీ జరిగింది. ఇంద్రపాలెం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.... చంద్రమౌళి శ్రీనివాసశర్మ (26) పౌరోహిత్యం చేస్తుంటాడు. ఆయన బుధవారం రాత్రి 10 గంటల తర్వాత ఇంటికి తాళాలు వేసి గృహప్రవేశ కార్యక్రమం నిమిత్తం పిఠాపురం వెళ్లాడు. కార్యక్రమాన్ని ముగించుకుని గురువారం ఉదయం 6 గంటలకు తన ఇంటికి వచ్చేసరికి గేటు, ఇంటికి వేసిన తాళాలు బద్దలు గొట్టి ఉండటంతో కంగారుగా ఇంటిని, గదిలోని బీరువాను పరిశీలించేసరికి సుమారు 160 గ్రాముల బంగారం, రూ.40,000 నగదు అపహరణకు గురైనట్టు గుర్తించి మధ్యాహ్నం ఇంద్రపాలెం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ ఎం.వీరబాబు పేర్కొన్నారు. శ్రీనివాస శర్మ భార్య, పిల్లలు విశాఖ జిల్లా చోడవరం వెళ్లారని చెప్పారు. చోరీ జరిగిన ఇంటిని ఏఎస్పీ మనీష్ దేవరాజ్ పాటిల్, క్లూస్ టీమ్ పరిశీలించారు.


చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న ఏఎస్పీ మనీష్ దేవరాజ్ పాటిల్

ఆదాయానికి మించి ఆస్తుల కేసులో...

డీఆర్ ఆనందరావు అరెస్టు

రాజమహేంద్రవరం/కాకినాడ మే 15 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా రిజిస్ట్రార్‌గా పనిచేస్తూ లంచం తీసుకుంటుండగా కె.ఆనందరావును మార్చి 28న ఏసీబీ అధికారులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో ఆయన బెయిల్‌పై ఉన్నారు. అయితే ఆ కేసు దర్యాప్తులో భాగంగా ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారనే సమాచారంతో ఈనెల 15న ఆయన కుటుంబ సభ్యుల ఇళ్లల్లో.. కాకినాడ, హైదరాబాద్, బోధన్ వంటి ప్రాంతాల్లోనూ సోదాలు చేశామని ఏసీబీ డీజీ అతుల్ సింగ్ పేర్కొన్నారు. ఆనందరావుపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసి రాజమహేంద్రవరం ఏసీబీ కోర్టులో హాజరుపరచనున్నామని తెలిపారు.

జగ్గంపేటలో ‘శుభం’ సందడి



జగ్గంపేట, మే 15(ఆంధ్రజ్యోతి): శుభం చిత్రబృందం గురువారం కాకినాడ జిల్లా జగ్గంపేటలో సందడి చేసింది. సక్సెస్ మీట్‌లో భాగంగా జగ్గంపేట ఎస్‌విఎఫ్ నాగేశ్వర థియేటర్‌కు బృందసభ్యులు హర్షితారెడ్డి, శ్రియ, శ్రీనివాస్ గౌరెడ్డి, శ్రావణి లక్ష్మి, చరణ్ పెర్రి, షాలిని కొండేపూడి, వంశీధర్, డైరెక్టర్ ప్రవీణ్ కాండ్రేగుల, ఆర్య విచ్చేశారు. ప్రేక్షకులతో కలిసి సినిమా చూసి ఆడిపాడారు.

3 గంటల పాటు రాజమండ్రిలో వివేక్ ఎక్స్‌ప్రెస్

ఊడిన ఏసీ బోగీ యాక్సిల్ బాక్స్ రింగ్ కవర్

గుర్తించి నిలిపివేసిన టీఎక్స్ఆర్ సిబ్బంది

రాజమహేంద్రవరం, మే 15 (ఆంధ్రజ్యోతి): దుబ్రిఘర్ నుంచి కన్యాకుమారి వెళ్తున్న ట్రైన్ నెంబర్ 22503 వివేక్ ఎక్స్‌ప్రెస్ మర మ్మతులకు గురికావడంతో తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రి స్టేషన్‌లో 3 గంటల పాటు నిలిపివేశారు. ఇది భారతదేశంలో అతి ఎక్కువ రోజులు ప్రయాణించే రైలు. ఈ రైలు గురువారం రాత్రి 8.50 గంటలకు రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్ మూడో ప్లాట్‌ఫాంకు చేరుకునే సమయంలో ఇంజన్ నుంచి 14వ బోగీ అయిన బీ1 ఏసీ బోగీ యాక్సిల్ బాక్స్ రింగ్‌కు ఉండే కవర్ ఊడిపోయి, బోల్టులు కూడా ఊడిపోతుండగా టీఎక్స్ఆర్ సిబ్బంది గుర్తించారు. అయితే కవర్ మార్చే ఏర్పాట్లు లేకపోవడంతో బీ1 బోగీని రాజమండ్రి స్టేషన్‌లో వదిలేసి మిగతా రైలును 11.50 ప్రాంతంలో పంపించారు. బీ1 బోగీలోని ప్రయాణికులను వేరే బోగీలో సర్దుబాటు చేశారు. విశాఖలో మరొక బోగీని లింక్ చేస్తామని అధికారులు తెలిపారు. ఎస్ఎంఆర్ రంగనాథ్, చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ కల్యాణ్ కుమార్ మరమ్మతులను పర్యవేక్షించారు. ఆర్‌పీఎఫ్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. విషయం గుర్తించక పోతే రైలు పట్టాలు తప్పి పెను ప్రమాదమే కలిగేది.


రాజమండ్రి రైల్వే స్టేషన్‌లో ఉండిపోయిన బీ1 బోగీ, ఊడిపోయిన బాక్స్ రింగ్ కవర్

చీటింగ్ కేసులో నిందితుడికి ఏడాది జైలు

కరప, మే 15 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి చీటింగ్ చేసిన వ్యక్తికి ఒక ఏడాది జైలు శిక్ష, రూ.1,000 జరిమానా విధిస్తూ కాకినాడ స్పెషల్ జేఎఫ్‌సీఎం కోర్టు మేజిస్ట్రేట్ తీర్పు ఇచ్చినట్టు కరప పోలీసులు తెలిపారు. కాకినాడ జిల్లా కరప మండలం పెద్దాపురప్పాడు గ్రామానికి చెందిన బిరుదా వెంకటరమణ అనే వ్యక్తి కుమారుడికి స్టీల్‌ప్లాంట్‌లో నెలకు రూ.50వేలు జీతం వచ్చే ఉద్యోగం ఇప్పిస్తానంటూ వైజాగ్‌కు చెందిన పూరెడ్డి శ్రీనివాసరెడ్డి అనే వ్యక్తి నమ్మించాడు. ఈ క్రమంలో వెంకటరమణ నుంచి రూ.10లక్షలు తీసుకుని ముఖం చాటేశాడు. ఉద్యోగం ఇప్పించకపోగా తీసుకున్న డబ్బు తిరిగి ఇవ్వాలని అడగ్గా చంపుతానని బెదిరించాడు. దీంతో చేసేదిలేక వెంకటరమణ 2015 డిసెంబరు 10వ తేదీన కరప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదుచేసిన అప్పటి ఎస్‌ఐ కోర్టులో చార్జిషీట్ ఫైల్ చేశారు. వాదోపవాదనల అనంతరం శ్రీనివాసరెడ్డి నేరం చేసినట్టు రుజువుకావడంతో ఏడాది జైలు శిక్ష విధిస్తూ స్పెషల్ జేఎఫ్‌సీఎం ఫర్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కోర్టు మేజిస్ట్రేట్ ఎ.నాగమల్లేశ్వరి తీర్పు వెలువరించారు. బాధితుడి తరఫున ఏపీపీ ఎస్.నాగరాధిక ఈ కేసు వాదించారు. ఈ కేసుకు సంబంధించిన సాక్షులు, సాక్ష్యాలను సమర్థవంతంగా కోర్టుకు అందజేసి నిందితుడికి శిక్షపడేలా చేసిన ఎస్‌ఐ సునీత, కోర్టు కానిస్టేబుల్ కె.రాజేష్‌లను సీఐ చైతన్యకృష్ణ అభినందించారు.

మహిళ మెడలోని బంగారం చోరీ

కాజులూరు (కరప), మే 15 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కాజులూరు మండలం పెనుమళ్ల గ్రామంలో భర్తతో కలిసి మోటర్‌సైకిల్‌పై వెళ్తున్న ఒక మహిళ మెడలోని 52గ్రాముల బంగారాన్ని గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు అపహరించుకుపోయారు. గొల్లపాలెం పోలీసులు తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని అండ్రంగి గ్రామానికి చెందిన బండారు త్రిమూర్తులు, అతడి భార్య సూర్యకాంతం గురువారం తెల్లవారుజామున 4గంటల సమయంలో మోటర్‌సైకిల్‌పై బంధువుల ఇంటికి వెళ్తున్నారు. పెనుమళ్ల గ్రామ శివారుకు వచ్చేసరికి గుర్తుతెలియని ఇద్దరు వ్య క్తులు వెనుక నుంచి వచ్చి సూర్యకాంతం మెడలోని బంగారు పుస్తెలతాడు, నల్లపూసల దండను బలవంతంగా లాక్కుని పారిపోయారు. నిందితులను వెంబడించినా ఫలితం లేకపోవడంతో బాధితులు గొల్లపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ మోహన్‌కుమార్ తెలిపారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు 279 మంది హాజరు

రంగంపేట, మే 15 (ఆంధ్రజ్యోతి): రంగంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలకు గురువారం మ్యాథ్స్, జువాలజీ, హిస్టరీ, మైక్రోబయోలజీ పరీక్షలకు 279మంది హాజరయ్యారని, 12మంది గైర్హాజరయ్యారని పరీక్షల సీఎస్ ఎస్.మాధురి తెలిపారు. ఉదయం ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షకు 246 మందికిగాను 243 మంది హాజరయ్యారని ఆమె తెలిపారు.

అపర భగీరథుడు కాటన్

● అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ● కాటన్ విగ్రహాలకు నాయకులు, అధికారులు, ఘన నివాళి


అనపర్తి: రామవరంలో కాటన్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

అనపర్తి, మే15(ఆంధ్రజ్యోతి): గోదావరి జిల్లాలను సస్యశ్యామలం చేసిన అపర భగీరథుడు సర్ ఆర్థర్ కాటన్ చిరస్మరణీయుడని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. కాటన్ 222వ జయంతి సందర్భంగా అనపర్తి మండలం రామవరంలోని కాటన్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గోదావరిజిల్లాల ప్రజలు కాటన్ మహాశయుడిని గుర్తించుకోవాలని అన్నారు. గోదావరినదిపై ఆనకట్టను నిర్మించి గోదావరి ప్రాంతానికి జీవం పోసిన కాటన్ ఇక్కడి ప్రజలకు దైవ సమానులని అన్నారు. సర్పంచ్‌లు గిరిడా గంగాభవాని, గొల్లు హేమతులసి, తేనెల శ్రీనివాస్, చింతా సురేష్‌రెడ్డి, నల్లమిల్లి గోపాలకృష్ణారెడ్డి, నల్లమిల్లి సుబ్బారెడ్డి, సిరసపల్లి నాగేశ్వరరావు, తాడి గంగిరెడ్డి పాల్గొన్నారు.

బిక్కవోలు: ఉభయగోదావరి జిల్లాలను సస్యశామలం చేసిన అపర భగీరధుడు సర్ ఆర్థర్ కాటన్‌దొర మహనీయుడని ఆరికరేవుల సర్పంచ్ రెడ్డి నాగవేణికుమారి అన్నారు. కాటన్ జయంతి సందర్భంగా గ్రామంలో వున్న ఆయన విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. నీటి సంఘ సభ్యులు నాళం సత్తిబాబు, మహిపాల స్వామినాయుడు, రెడ్డి శ్రీను, రైతులు పాల్గొన్నారు. ఊలపల్లి వంతెన వద్ద వున్న కాటన్ విగ్రహానికి బిక్కవోలు పీహెచ్‌సీ మాజీ అధ్యక్షుడు తొండాపు సురేష్‌కుమార్‌రెడ్డి పూల మాల వేసి నివాళులు అర్పించారు. సర్పంచ్ బండారు రమ్య, కూటమి నేతలు కాకర్ల రామతారకం, అర్జున్, గెద్దాడ శ్రీను, కేతా సూరిబాబు, పాలిక రమణ, పంచాయతీ కార్యదర్శి అచ్చియ్య చౌదరి పాల్గొన్నారు. బిక్కవోలు ఇరిగేషన్ కార్యాలయంవద్ద బిక్కవోలు నీటి సంఘ ఉ పాధ్యక్షుడు పడాల లక్ష్మణరావు కాటన్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. డైరెక్టర్లు గోలి నాగేశ్వరరావు, పి.గణపతి, ఇరిగేషన్ సిబ్బ ంది సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కాటన్ జయంతి వేడుకలు

కడియం: లక్షలాది ఎకరాలకు నీరందించి పంటభూములుగా మార్చిన కాటన్ మహాశయా మీ మేలు మరువలేమంటూ దుళ్ళ గ్రామానికి చెందిన సత్తి భాస్కరరెడ్డి (కందరెడ్డి) పేర్కొన్నారు. గురువారం దుళ్ళలో ఆయన తన ఇంటి ముందు ఏర్పాటుచేసిన కాటన్ విగ్రహంవద్ద కాటన్ జయంతిని నిర్వహించారు. ప్రజాప్రతినిధులను, రైతులను పిలిచి కాటన్ విగ్రహానికి పూలమాలలు వేసి కాటన్ మహాశయునికి నివాళులర్పించారు. మాజీ సర్పంచ్ గుర్రపు సత్యనారాయణ, నాయకులు, రైతులు పాల్గొన్నారు.


దుళ్ళలో ఆదర్శ రైతు కందరెడ్డి ఆధ్వర్యంలో కాటన్ జయంతిని నిర్వహిస్తున్న దృశ్యం


బిక్కవోలు: ఆరికరేవులలో కాటన్ విగ్రహానికి పూలమాల వేస్తున్న సర్పంచ్ కుమారి


కాటన్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న శ్రీనివాస్, ఎండీ ఉస్మాన్, యువజన నాయకులు.


గోదావరి గట్టున కాటన్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న విశ్వేశ్వరరెడ్డి

● ఆంధ్రప్రదేశ్‌ను అన్నపూర్ణ ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దిన మహనీయుడు కాటన్ అని వైసీపీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల బాబు అన్నారు. గిరజాల బాబు తన కార్యాలయంలో కాటన్ జయంతిని నిర్వహించారు. పూలమాలలు, ధాన్యం వేసి నివాళులర్పించారు. కుసునూరి బాబులు, దొడ్డా బుజ్జి, దంగుడుబియ్యం సుబ్బారావు, చిలుకూరి రామకృష్ణ, పూడి బ్రహ్మం, మహిపాల వాసు, చెక్కా కాశీ, మలకల దొరబాబు, పల్ల వెంకటేశ్వరరావు, ఎస్ వీరనాగు తదితరులు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం కల్చరల్ : అపర భగీరధుడు సర్ ఆర్థర్ కాటన్ 222వ జన్మదిన వేడుకలు రివర్ బే ప్రాంగణంలో గల సర్ ఆర్థర్ కాటన్ యూత్ సర్కిల్ వ్యవస్థాపక కార్యదర్శి టి.శ్రీనివాస్ యాదవ్ కాటన్‌విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. యువజన నాయకులు షేక్ సుభాన్‌వల్లి, సర్దార్ కాటన్ యూత్ సర్కిల్ అధ్యక్షులు ఎండిఉస్మాన్, వంట ఉమా యాదవ్, రాజా కోటేశ్వరరావు, జొన్నాడ నాని, ఆవాల బాబి,వంగా నాగేశ్వరరావు, ఆరవ సూర్యదీప, రివర్‌బే సిబ్బంది పాల్గొన్నారు. గోదావరి గట్టున పీవీ నరసింహరావు పార్కులో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు టికెవిశ్వేశ్వరరెడ్డి కాటన్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. సమితి ప్రతినిధులు బలరామనాయుడు, మాదిరాజు శ్రీనివాస్, దూర్వాసుల సత్యనారాయణ మాట్లాడుతూ కాటన్ కారణంగా గోదావరికి మరింత గుర్తింపు వచ్చిందన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రాజమహేంద్రవరంరూరల్, మే15 (ఆంధ్రజ్యోతి): రూరల్ మండలం పరిధిలోని కొంతమూరులో గల 33/11కెవీ సబ్‌స్టేషన్‌లో అత్యవసర మరమ్మతుల నిమిత్తం రాయుడు పాకలు, కోలమూరు, కొంతమూరు ఏరియాల పరిధిలోని బొమ్మనకాలనీ, నాల్గవ(గామన్) వంతెన ప్రాంతం, కళ్యాణ్ నగర్, ఆదర్శనగర్, నూకాలమ్మగుడి ప్రాంతం, ముస్లింపేట, ఎంప్లాయిస్ కాలనీ, జంగాల కాలనీ, శేషాద్రి లేఅవుట్, క్వారీ ఏరియా, కంటిపూడి లే అవుట్, 14 ఎకరాల లేఅవుట్, బీసీ కాలనీ, భవానీ పురం, కాతేరు గ్రామం పరిధిలోని శాంతినగర్, తిరుమల కళాశాల ప్రాంతం, జీఎస్ఆర్ ఆన్‌లైన్, పంచాయతీ కార్యాలయం ఏరియా, బ్రాహ్మణ అగ్రహారం ప్రాంతాలలో ఉదయం 7 గంటలనుంచి 11 గంటల వరకు విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నక్కపల్లి శ్యామ్యూల్ ఒక ప్రకటనలో తెలిపారు.

దివాన్‌చెరువు: దివాన్‌చెరువు విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి సరఫరా అయ్యే 11 కేవీ ఇండస్ట్రీయల్ ఫీడర్‌కు శుక్రవారం ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకూ మరమ్మతుల నిమిత్తం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ రాజమహేంద్రవరం రూరల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఆపరేషన్) జేపీబీ నటరాజన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా దివాన్‌చెరువు గ్రామానికి విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని తెలిపారు. విద్యుత్ వినియోగదారులందరూ ఈ అసౌకర్యాన్ని గమనించి డిపార్ట్‌మెంట్ వారికి సహకరించాలని కోరారు.

సీతానగరం: నేడు శుక్రవారం సీతానగరం మండలం కాటవరం, జాలిమూడి గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జేపీబీ నటరాజన్ తెలిపారు. శుక్రవారం ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని, విద్యుత్ వినియోగదారులు ఈ సౌకార్యాన్ని గమనించి సహకరించాలని కోరారు

జల్‌జీవన్ మిషన్ పనులు పూర్తయ్యేదెన్నడు: సీపీఎం

రాజమహేంద్రవరం అర్బన్, మే 15 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో జల్‌జీవన్ మిషన్ పథకంలో మండలాల్లో చేపడుతున్న పనులు ఎప్పటికి పూర్తవుతాయో అధికారులు చెప్పాలని సీపీఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ పనులు సకాలంలో పూర్తికాకపోవడంతో ప్రజలు తాగునీరులేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మరమ్మతులకు గురైన కొన్ని చేతిపంపులు, ఓవర్‌హెడ్ ట్యాంకులను జల్‌జీవన్ మిషన్‌లో చేర్చారని, వాటికి మరమ్మతు చేయాల్సి ఉన్నా నేటికీ పూర్తికాలేదని తెలిపారు. గతంలో చేపట్టిన పనులకు ప్రభుత్వం బకాయి బిల్లులు చెల్లించి పనులు వేగవంతం చేయాలని ఆయన కోరారు.

టీడీపీ గ్రామ కమిటీ ఎన్నిక ఏకగ్రీవం


అడబాల వెంకట్రావుని, నూతన కమిటీని సత్కరిస్తున్న దృశ్యం

రంగంపేట, మే 15(ఆంధ్రజ్యోతి): అనపర్తి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జ్, అనపర్తి ఎమ్మెల్యే తనయుడు నల్లమిల్లి మనోజ్‌రెడ్డి ఆదేశాల మేరకు టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆళ్ల గోవిందు ఆధ్వర్యంలో గ్రామ టీడీపీ సీనియర్ నాయకులు అడబాల వెంకట్రావు అధ్యక్షతన రంగంపేట మండలం ఎస్టీరాజాపురం గ్రామ కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా అడబాల సాయికృష్ణ, ఉపాధ్యక్షుడిగా బేదంపూడి రవి, ప్రధానకార్యదర్శిగా సూరిశెట్టి భాస్కరరావు, కార్యనిర్వాహక కార్యదర్శులు, కార్యదర్శులు, కోశాధికారిని ఎన్నుకోవడం జరిగిందని అడబాల వెంకట్రావు తెలిపారు. పార్టీ బలోపేతానికి తమ వంతుకృషి చేస్తామని కమిటీ సభ్యులు తెలిపారు. నూతన కమిటీ సభ్యులకు పూలమాలలువేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో గ్రామ టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వేర్వేరు చోట్ల ముగ్గురు మృతి

● ఇద్దరు ఆత్మహత్య, ఒకరు అనుమానాస్పద మృతి

రాజమహేంద్రవరంసిటీ, మే 15 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో వేర్వేరుచోట్ల ముగ్గురు వ్యక్తులు మృతి చెందారు. పోలీసుల కథనం ప్రకారం వివరాల్లోకి వెళితే స్థానిక ఆల్‌కట్ తోటకు చెందిన బి.ప్రసాద్ (33) మెడికల్ రిప్రజెంటేటివ్‌గా పనిచేస్తున్నాడు. గత కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాడు. ఈ నేపథ్యంలో ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో ఇంట్లో ఫ్యాక్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య ఫిర్యాదు మేరకు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. అదేవిధంగా స్థానిక అన్నపూర్ణంపేటకు చెందిన ఎం.ఆనంద్ (44) రాజమహేంద్రవరం కార్పొరేషన్‌లో తాత్కాలిక పారిశుధ్య కార్మికుడిగా పనిచేస్తున్నాడు. అతనికి భార్య, పిల్లలు ఉన్నారు. తరచూ తాగి భార్యతో గొడవ పడుతున్నాడు. ఈ క్రమంలో గురువారం తన ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. అదేవిధంగా రాజమహేంద్రవరంరూరల్ మండలం కాతేరు గ్రామానికి చెందిన ఐ.నూకరాజు (64) అనే వృద్ధుడు ఈనెల 14న కడుపునొప్పిగా వుందని ఇంట్లో చెప్పి బయటకు వెళ్లాడు. తిరిగి ఇంటికి రాలేదు. చుట్టుపక్కల వెతికినా కనిపించలేదు. తెల్లవారే సరికి రాయుడు చెరువు గట్టుపై మృతిచెంది పడివున్నట్లు స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. త్రీటౌన్ పోలీసులు కేసు నమోదుచేసి మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు. మృతుడు నూకరాజు కుమారుడు శంకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాఫిక్ కానిస్టేబుల్‌పై గుర్తుతెలియని వ్యక్తి దాడి

రాజమహేంద్రవరం సిటీ, మే 15 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం కంబాలచెరువు సెంటర్‌వద్ద విధి నిర్వహణలో ఉన్న ట్రాఫిక్ కానిస్టేబుల్ పై గుర్తుతెలియని వ్యక్తి దాడి చేశాడని త్రీటౌన్ పోలీసులు తెలిపారు. పోలీసుల కతనం ప్రకారం వివరాల్లోకి వెళితే ట్రాఫిక్ కానిస్టేబుల్ కె.రామచంద్రరావు రాంగ్‌రూట్‌లో వస్తున్న ద్విచక్ర వాహనదారుడిని ఆపి ప్రశ్నించడంతో అతను గొడవకు దిగి దౌర్జన్యం చేయడంతో అతని బైక్‌ను సెల్‌తో ఫొటో తీస్తుండగా దాడిచేసి పారిపోయాడని బాధిత కానిస్టేబుల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

సీతారామచంద్రస్వామి సప్తాహ మహోత్సవం

అనపర్తి, మే 15 (ఆంధ్రజ్యోతి): అనపర్తి మండలం పులగుర్తలో ఉన్న సీతారామ చంద్రస్వామిఆలయంలో గురువారం సప్తాహ మహోత్సవం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా స్వామివారిని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి దర్శించుకుని ప్రత్యేకపూజలు చేశారు. ఆలయం ప్రాంగణంలో ఉన్న సిద్ధి వినాయకుడికి గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త కొట్నాల సతీష్ మొక్కుకున్న 108 కొబ్బరి కాయల మొక్కును ఎమ్మెల్యే చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు సిరసపల్లి నాగేశ్వరరావు, పేరిశెట్టి లాలయ్య, కూటమి నాయకులు పాల్గొన్నారు.


సిద్ధి వినాయకుడిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

శ్రీకృష్ణపట్నంను ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతా

● ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ

దివాన్‌చెరువు, మే 15 (ఆంధ్రజ్యోతి): రాజానగరం మండలం శ్రీకృష్ణపట్నంలో త్వరలోనే జూనియర్ కళాశాలను, పీహెచ్‌సీని ఏర్పాటు చేస్తామని రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అన్నారు. శ్రీకృష్ణపట్నంలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామంలోని డ్రైనేజీలు, రోడ్లు, వీధిదీపాలు, పొలాలకు వెళ్లే రహదార్ల పనులను కూడా పూర్తిచేస్తానని అన్నారు. ప్రధానమంత్రి నుంచి అవార్డు అందుకునే విధంగా రాబోయే రోజులలో శ్రీకృష్ణపట్నంను ఆదర్శ గ్రామంగా తీర్చుదిద్దుతానని ఎమ్మెల్యే బత్తుల తెలిపారు. తమ అమ్మమ్మగారి గ్రామం అయినందునో, ప్రధాని చేతులమీదుగా అవార్డు అందుకోవాలన్న ఉద్దేశంతోనూ, గతంలో ఎన్నడూ చూడని అభివృద్ధిని ఈగ్రామంలో చేసి చూపెడతామని చెప్పారు. వైసీపీ నుంచి జనసేన పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే బత్తుల కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. శ్రీకృష్ణపట్నం సర్పంచ్ కిమిడి శ్రీరామ్ పాల్గొన్నారు.


శ్రీకృష్ణపట్నంలో జరిగిన కార్యక్రమంలోపాల్గొన్న ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ

ఆరోగ్యవంతమైన సమాజం కోసం కృషి

● సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేసిన ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు


సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

రాజమహేంద్రవరంసిటీ, మే 15(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యకరమైన సమా జంకోసం కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని రాజమహేంద్రవరం ఎమ్మె ల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. రాజమహేంద్రవరం తిలక్ రోడ్డులోని తన కార్యాలయంలో గురువారం ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు ఒకరికి సీఎంఆర్ఎఫ్ చెక్కు రూ.లక్షా 25వేలు అందించారు. ఈ సందర్భంగా ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ తన నియోజకవర్గంలో ఇప్పటి వరకు 85 మంది సీఎంఆర్ ఎఫ్ చెక్కులు రూ.కోటి 47లక్షల వరకు అందించామన్నారు. తమ ప్రభుత్వం వైద్యానికి ప్రాధాన్యం కల్పిస్తుందన్నారు. రాష్ట్ర ప్రజలంతా ఆరోగ్యంగా ఉండాలనేది సీఎం చంద్రబాబు సంకల్పమన్నారు. అందుకే ఎన్టీఆర్ వైద్యసేవల ద్వారా పేదలకు సీఎం సహాయ నిధి సాయం అందజేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ పార్లమెంట్ కమిటీ ఉపాధ్యక్షుడు మజ్జి రాంబా బు, తదితరులు పాల్గొన్నారు.

సోఫియా ఖురేషిపై వ్యాఖ్యలను నిరశిస్తూ కాంగ్రెస్ ధర్నా


జాంపేట ఆజాద్ చౌక్‌వద్ద ధర్నా చేస్తున్న టీకే విశ్వేశ్వరరెడ్డి, కాంగ్రెస్ నాయకులు

రాజమహేంద్రవరంసిటీ, మే 15(ఆంధ్రజ్యోతి): పాకిస్థాన్‌పై చేసిన యుద్ధంలో కీలకంగా వ్యవహరించిన ఇండియన్ ఆర్మీ అధికారి కల్నల్ సోఫియా ఖురేషీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మధ్యప్రదేశ్ మంత్రి కున్వర్ విజయ్‌షాని తక్షణమే భర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ రాజమహేంద్రవరంలో కాంగ్రెస్‌పార్టీ నాయకులు ధర్నా చేశారు. గురువారం స్థానిక జాంపేట ఆజాద్‌చౌక్‌లో జరిగిన ధర్నాలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ పహల్గాంలో జరిగిన ఉగ్రవాద డాడిలో 28 మంది భారతీయులు మరణిస్తే దేశం చలించిందని అది యుద్ధం వరకు దారి తీసిందన్నారు. పాకిస్దాన్‌పై వీరోచింతంగా పోరాడి ఉగ్రవాద స్థావరాలను సోఫియా ఖురేషి మట్టుపెడితే ఆమెపై బీజేపీ మంత్రి కున్వర్ విజయ్ షా అనుచితంగా మాట్లాడడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. మంత్రిని తొలగించడంతో పాటు అతన్ని బీజేపీ నుంచి బహిష్కరించాలన్నారు. ఉగ్రవాద స్థావరాలపై దాడులు చేసి మట్టుబెట్టిన సోఫియా ఖురేషిని సెల్యూట్ చేస్తున్నామన్నారు. తొలుత బీజేపీ మంత్రి దిష్టిబొమ్మను దహనం చేయాలని టీకే ప్రయత్నించగా పోలీసులు దానిని అడ్డుకుని దిష్టిబొమ్మను లాక్కుని తొలగించారు. అనంతరం పోలీసుల తీరును వ్యతిరేకించి రోడ్డుపై బైటాయించి ధర్నా చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మార్టిన్ లూథర్, వడయార్, బెజవాడ రంగారావు, మోతా శారద పాల్గొన్నారు.

ముగిసిన వేసవి శిక్షణా శిబిరం

రాజమహేంద్రవరంఅర్బన్, మే 15 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలోని టౌన్ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్‌లో జన విజ్ఞానవేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన వేసవి శిక్షణాశిబిరం గురువారంతో ముగిసింది. ముగింపు కార్యక్రమంలో జనవిజ్ఞానవేదిక ప్రధాన కార్యదర్శి ఎస్.రవిబాబు మాట్లాడుతూ విద్యార్థులు వేసవి సెలవుల్లో విరామ సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ కొత్త విషయాలు, నైపుణ్యాలు నేర్చుకోవడానికి, శాస్త్రీయ దృక్పధాన్ని పెంపొందించుకోవడానికి ఈ శిక్షణా శిబిరం నిర్వహించామని అన్నారు. గౌరవాధ్యక్షుడు ఎం.మల్లికార్జునరావు, అధ్యక్షుడు కె.భీమయ్య, సీనియర్ నాయకులు సీహెచ్ శ్రీరాములు మాట్లాడారు. ఈ సందర్భంగా వివిధ అంశాల్లో నిర్వహించిన పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జేవీవీ నాయకులు చెక్క తాతారావు, తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలన సమిష్టి బాధ్యత

● శిశు సంక్షేమశాఖ ప్రాజెక్టు డైరెక్టర్ విజయలక్ష్మి


సమావేశంలో మాట్లాడుతున్న విజయలక్ష్మి

రాజానగరం, మే (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాల నిర్మూలన సమిష్టి బాధ్యతగా గుర్తించాలని మహిళాభివృద్ధి, శిశి సంక్షేమశాఖ ప్రాజెక్టు డైరె క్టర్ కె.విజయలక్ష్మి పిలుపునిచ్చారు. బాల్య వివాహాల నిరోధంపై మండ లంలోని వివిధశాఖల అధికారులతో కలిసి స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండల చైల్డ్‌రైట్స్ అడ్వకేట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో విజయలక్ష్మి మాట్లాడుతూ చైల్డ్ మ్యారేజ్ నిరోధక అధికా రులంతా గ్రామ స్థాయిలో జరుగుతున్న బాల్యవివాహాలను అరికట్టే దిశగా కృషిచేయాలన్నారు. బాలల హక్కుల పరిరక్షణకు అందరూ సహకరించి, బాల్య వివాహ రహిత మండలంగా తయారు చేయాలన్నారు. జిల్లాలలో రాజానగరం మండలంలో ఒక్క బాల్యవివాహం కూడా జరగకూడదని చైల్డ్ మ్యారేజ్ నిరోధక అధికారులకు సూచించారు. ఈకార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీవో టి.నాగమణి, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ వర్కర్లు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, జిల్లా క్రాఫ్ కోఆర్డినేటర్ రాజ్‌కుమార్ పాల్గన్నారు.

19న కాకినాడలో కొండేపూడి సంతాప సభ


సమావేశంలో మాట్లాడుతున్న కొత్తపల్లి ప్రసాద్

రాజమహేంద్రవరం సిటీ, మే 15(ఆంధ్రజ్యోతి): మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా మాజీ అధ్యక్షుడు కొండేపూడి శ్యాంబాబు మాదిగ సంతాప సభ ఈనెల 19న కాకినాడ కమల్‌వీర్ జంక్షన్‌లోని గోకుల్ రోడ్డులో జరుగుతుందని మాదిగ లాయర్ల ఫెడరేషన్ అధికార ప్రతినిధి కొత్తపల్లి ప్రసాద్ తెలిపారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణకోసం అన్న మందకృష్ణమాదిగ చేసిన పోరాటంలో అడుగులో అడుగులు వేస్తూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఉద్యమాన్ని తీవ్రతరం చేసిన కొండేపూడి శ్యాంబాబు గతనెల 18న మృతి చెందారని చెప్పారు. ఆయన సంతాప సభకు ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపకుడు మందా కృష్ణమాదిగ ముఖ్యఅతిథిగా హాజరవుతున్నారని చెప్పారు. ఈ సభకు ఎమ్మార్పీఎస్ మాదిగ ఉద్యోగ,విద్యార్థి సంఘాలు తరలిరావాలన్నారు. ఈ సమావేశంలో కొండేపూడి ఉదయ్‌కుమార్, ఎమ్మార్పీఎస్ కోస్తా రిజియన్ కన్వీనర్ ముమ్మిడివరపు చినసుబ్బారావు మాట్లాడారు. ఈ సమావేశంలో మాదిగ లాయర్ల ఫెడరేషన్ మాజీ అధికార ప్రతినిధి యార్లగడ్డ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పెందుర్తి పుట్టినరోజు వేడుకలు


కేక్ కట్‌చేస్తున్న టీడీపీ నాయకులు తదితరులు

దివాన్‌చెరువు, మే15 (ఆంధ్రజ్యోతి): ఏపీఎం ప్రోగ్రాం కోఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే పెందుర్తి వెంకటేష్ జన్మదినోత్సవ వేడుకలను దివాన్‌చెరువులో కార్మికుల సమక్షంలో గురువారం ఘనంగా నిర్వహించారు. దివాన్‌చెరువులోని శ్రీరాంపురం రోడ్‌లోని ఆటోస్టాండ్ వద్ద బర్త్ డే కేక్‌ను కట్‌చేసి చిన్నపిల్లలకు, స్థానికులకు పంచారు. కార్యక్రమంలో టీఎన్‌టీ యూసీ అధికారప్రతినిధి దాసరి శ్రీనివాసరావు, రాష్ట్ర గౌడసాధికారసమితి డైరెక్టర్ వంక మల్లికార్జునస్వామి, ఆటో యూనియన్ ఉపాధ్యక్షుడు చిలకసాని రాంబాబు, మారిశెట్టి శ్రీనివాస్, మట్టా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఇంట్లో దొంగలుపడి

12 గ్రాముల బంగారం అపహరణ

రాజమహేంద్రవరంసిటీ మే 15 (ఆంధ్ర జ్యోతి): రాజమహేంద్రవరం ఇన్నీ సుపేటలో ఒక ఇంట్లో గుర్తుతెలియని దొంగలు పడి 12గ్రాములు బంగారు వస్తువులు, వెండి వస్తువులు అపహరించుకుపోయారని వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం వివరాల్లోకి వెళితే ఇన్నీసుపేటకు చెందిన కె.వీరవెంకట సత్యనారాయణ గత నెల 24న తన భార్యతో కలిసి నాగ్‌పూర్ వెళ్లారు. తిరిగి గురువారం ఇంటికి చేరుకున్నారు. ఇంటి తలుపులు తీసి లోపల బీరువా తీసివుందని బీరువాలో పెట్టిన 12 గ్రాముల బంగారు, వెండి వస్తువులు కనిపించలేదన్నారు. బాధితుల ఫిర్యాదుతో పోలీసులు పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్‌కేవీటీలో ఉచిత కాంపిటేటివ్ కోచింగ్ ప్రారంభం

రాజమహేంద్రవరం అర్బన్, మే 15 (ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరంలోని ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సివిల్స్, పబ్లిక్ సర్వీస్ కమిషన్, బ్యాంకింగ్, ఇతర పోటీ పరీక్షలకు ఉచిత కోచింగ్ ప్రారంభించడం పేద విద్యార్థులకు ఉపయోగకరమని ఆర్‌కే స్టడీ సెంటర్ నిర్వాహకుడు పి.రామకృష్ణ అన్నారు. గురువారం ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాలలో పోటీ పరీక్షల ఉచిత కోచింగ్ సెంటర్‌ను ప్రారంభించారు. కళాశాల ప్రిన్సిపాల్ బీవీ తిరుపుణ్యం మాట్లాడుతూ ఉచిత కోచింగ్ కోసం ఆర్‌కే స్టడీసెంటర్‌తో ఎంవోయూ చేసుకుందన్నారు. ప్రతి విద్యార్థి సెల్‌ఫోన్ వదిలి పుస్తకాన్ని చేత్తో పట్టుకోవాలన్నారు. లైబ్రరీని 24 గంటలు అందుబాటులోకి తీసుకొస్తామని పేర్కొన్నారు. విద్యార్థులు, నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కాంపిటీటివ్ కోచింగ్ సెంటర్ కో ఆర్డినేటర్‌గా ఎంఎస్ ఫణికుమార్, పీజీ సెట్ కోచింగ్ సెంటర్ కోఆర్డినేటర్‌గా ఎం.శివప్రసాద్ సేవలు అందిస్తారని తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు శరత్‌బాబు, వై.స్వర్ణశ్రీ, పీవీబీ సంజీవరావు, మూర్తి, ఇతర అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.


ఆర్‌కే స్టడీసెంటర్‌తో ఎంఓయూ చేసుకుంటున్న ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ తిరుపుణ్యం, అధ్యాపకులు



రాజమహేంద్రవరం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 40.0 (గురువారం)
కనిష్ఠం : 25.0

పదవి.. మరింత బాధ్యత పెంచింది!

ఎస్సీ కమిషన్ చైర్మన్ జవహర్

కొవ్వూరు, మే 15 (ఆంధ్రజ్యోతి) : దళితుల అభివృద్ధి సంక్షేమానికే ప్రభుత్వం ఎస్సీ కమిషన్ ఏర్పాటు చేసిందని ఎస్సీ కమిషన్ చైర్మన్ కె.ఎస్.జవహర్ అన్నారు. ఎస్సీ కమిషన్ చైర్మన్‌గా తొలిసారి నియోజకవర్గానికి వచ్చిన జవహర్‌కు గురువారం కొవ్వూరు మండలం ఐ.పంగిడి గ్రామంలో ఘనంగా స్వాగతం పలికారు.పంగిడి నుంచి కార్లు, మోటారుసైకిళ్లపై కాపవరం, దొమ్మేరు మీదుగా కొవ్వూరు వరకూ ర్యాలీ చేశారు. మార్గమధ్యలో బాబూ జగ్జీవన్‌రామ్, అంబేడ్కర్, ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జవహర్ నివాసంలో విలేకరులతో మాట్లాడారు. పదవి తన బరువు, బాధ్యతలు మరింత పెంచిందన్నారు. రాష్ట్రంలో వివక్షత లేని సమసమాజం స్థాపిస్తామన్నారు..గత ప్రభుత్వంలో శిరోముండనం నుంచి ఎమ్మెల్సీలు హత్యలు చేసి జైలుకు వెళ్లిన సంఘటనలు చూశామన్నారు. రాళ్ళ దాడులు, భూఆక్రమణలు, కబ్జాలు చూశామని, వీటన్నింటినీ నియంత్రించడమే నా ముందున్న పెద్ద సవాలన్నారు.కార్యక్రమంలో బూరుగుపల్లి రాఘవులు,వేగి చిన్నా, కోడూరి ప్రసాద్, పసలపూడి బోసు, పి.వి.వి.భద్రం, డా.ముళ్ళపూడి రాజేంద్రప్రసాద్, పి.కె.రంగారావు, ఆలపాటి సాయి కృష్ణ, బిక్కిన ఫణీంద్ర, ఖండబట్టు విజయలక్ష్మి, చిట్టూరి వెంకటేశ్వరరావు, పిక్కినాగేంద్ర పాల్గొన్నారు.



పంగిడిలో జవహర్‌కు గజమాల వేసి ఘనంగా స్వాగతం పలుకుతున్న టీడీపీ నాయకులు, అభిమానులు

మన దైవం కాటన్ : దుర్గేష్

కడియం, మే 15(ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల ఆరాధ్య దైవం కాటన్ మహాశయుడు అని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు.సర్ ఆర్థర్‌కాటన్ నర్సరీ అసోసియేసన్ కార్యాలయం వద్ద అసోసియేషన్ అధ్యక్షుడు రత్నం అయ్యప్ప, కార్యవర్గ సభ్యుల ఆధ్వర్యంలో కాటన్ జయంతి కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించారు.మంత్రి కందుల దుర్గేష్, టీడీపీ రాష్ట్ర వైద్యవిభాగం ప్రధాన కార్యదర్శి డా.గోరంట్ల రవిరామ్‌కిరణ్ కాటన్ మహాశయుడి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.కేక్ కట్ చేసి నాయకులకు పంచారు. కడియం నర్సరీరంగానికి కూటమి ప్రభుత్వం అండగా ఉం టుందని తెలిపారు.అనంతరం మంత్రి దుర్గేష్, టీడీపీ రాష్ట్ర నాయకులు డా.గోరంట్ల రవిరామ్‌కిరణ్‌లను నర్సరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో సత్కరించారు.కార్యక్రమంలో నర్సరీ సంఘం ఉపాధ్యక్షుడు బోడపాటి గోపి, ఐఎన్ఏ మాజీ డైరెక్టర్ మార్గాని సత్యనారాయణ, పుల్లా అబ్బులు, ఇన్‌చార్జి సర్పంచ్ పాటంశెట్టి రాంజీ, వైస్ ఎంపీపీ వంతం గణపతి, ముద్రగడ జమీ, మార్గాని ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న మంత్రి దుర్గేష్, ఇన్‌సెట్‌లో కాటన్ విగ్రహానికి పూలమాల



పుష్కరాలకు 27 రహదారుల విస్తరణ

రాజమహేంద్రవరం సిటీ, మే 15 (ఆంధ్రజ్యోతి): గోదావరి పుష్కరాలు 2027కు ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు ఇప్పటి నుంచే రహదారుల విస్తరణ పనులు రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ చేపట్టింది. ఈ మేరకు గురువారం నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్ గార్గ్ ఒక ప్రకటన విడుదల చేశారు. 24 ప్రధాన రహదారులను విస్తరిస్తామని పేర్కొన్నారు.రహదారుల విస్తరణ పనులు ఫేజ్ 1,2 విధానంలో చేస్తున్నామన్నారు. ఫేజ్-1లో భాగంగా ఇప్పటికే ఈస్ట్ రైల్వే స్టేషన్ రోడ్డు, మోరంపూడి రోడ్డు, కోరుకొండ రోడ్డు, గుండువారి వీధి ,గాదాలమ్మ టెంపుల్ రోడ్డు విస్తరణ పనులు చేపట్టినట్టు వెల్లడించారు. దాదాపు 50 శాతానికి పైగా పనులు పూర్తికాగా ఈ ఐదు రహదారులకు సంబంధించి టీడీఆర్ బాండ్ల జారీ ప్రక్రియను త్వరలో పూర్తి చేస్తామన్నారు. ఫేజ్ -2 లో మరో పది రహదారులను అభివృద్ధి చేస్తామన్నారు. కొత్త మాస్టర్ ప్లాన్ ప్రకారం కోటిలింగాల ఘాట్ రోడ్డు, జెండా పంజారోడ్డు, కాతేరు రోడ్డు, స్టేడియం రోడ్డు, ఓల్డ్ బైపాస్‌రోడ్డు, సీతంపేట రోడ్డు, టింబర్ యార్డు మెయిన్ రోడ్డు, మూలగొయ్యి జంక్షన్, ఉండవల్లి వారి వీధి, శేషయ్యమెట్ట జంక్షన్‌రోడ్డును విస్తరించడం జరుగుతుందన్నారు. ప్రైవేట్ భవన యజమానులు స్వచ్ఛందంగా రోడ్డు విస్తరణకు ముందుకు వచ్చి అంగీకార పత్రాలను నగరపాలక సంస్థకు అందజేశారన్నారు. విస్తరణలో వారి ఆస్తి అర్హతను బట్టి భవన యజమానులకు నష్టపరిహారం ఇవ్వడం జరుగుతుందన్నారు. ఫేజ్ 1,2 కలిపి 15 రహదారుల అభివృద్ధికి నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళిక విభాగం ఆధ్వర్యంలో 15 టీమ్‌లు సైతం ఏర్పాటు చేసుకున్నామన్నారు. ప్రతి కమిటీలోను ఒక అసిస్టెంట్ సిటీ ప్లానర్ ,టౌన్ సర్వేయర్, టీపీబీవో, వీఆర్వో , సచివాలయ కార్యదర్శులు ఉంటారన్నారు. రోడ్డు విస్తరణ అభివృద్ధి పనులు పూర్తయిన తర్వాత వాహనాల రద్దీ కారణంగా ఎదురవుతున్న సమస్యలన్నీ తొలగిపోతాయన్నారు. నగర అభివృద్ధికి ప్రజలంతా సహకరించాలని కమిషనర్ కోరారు.



కొత్త కార్డుకు కష్టాలు

నిబంధనాలు

కూటమి ప్రభుత్వం నూతన రేషన్‌కార్డుల జారీ, కార్డుల విభజన, కొత్తగా కుటుంబ సభ్యుల చేర్పులు, తొలగింపులు, చిరునామా మార్పులకు దరఖాస్తుల స్వీకరణతో పాటు ఇప్పటికే రైస్ కార్డులు ఉన్న వారు వాటిని ప్రభుత్వానికి సరెండర్ చేసే అవకాశాన్ని కల్పించింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల్లోని అన్ని వార్డు, గ్రామ సచివాలయాల్లో కొన్ని రోజులుగా దరఖాస్తుల స్వీకరణ జరుగుతోంది.దరఖాస్తులను ఆన్‌లైన్ చేసే ప్రక్రియలో విధించిన నిబంధనలు ఇప్పుడు కొత్త కష్టాలు తెచ్చిపెట్టాయి. అన్ని సరిచూసుకుని అప్‌లోడ్ చేసే సమయానికి సర్వర్లు పనిచేయక దరఖాస్తు చేసుకునేందుకు మూడు, నాలుగుసార్లు సచివాలయాలకు వెళ్లాల్సి వస్తోంది. కార్డులకు ఇన్ని నిబంధనలు ఉంటే ఎలాగంటూ పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

మ్యాపింగ్ తంటా..

రేషన్‌కార్డుకు వివాహమై పిల్లలు ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలంటే భార్యాభర్తలు, పిల్లలు ఒకేచోట హౌస్ మ్యాపింగ్ ఉండాలి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో వలంటీర్ల ద్వారా కుటుంబాల స్థితిగతులను తెలుసుకునేందుకు హౌస్‌హోల్డ్ మ్యాపింగ్ చేశారు. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం దరఖాస్తుల స్వీకరణకు దీనినే ప్రామాణికంగా నిర్దేశించింది. తల్లిదండ్రులు, వారి పిల్లలు ఒకే కుటుంబం అయినప్పటికీ మ్యాపింగ్‌లో ఒకేచోట లేకపోతే దరఖాస్తు స్వీకరణ సమయంలో ఆన్‌లైన్‌లో ఎర్రర్ చూపిస్తోంది. అప్పుడు వలంటీర్లు చేసిన తప్పిదాలు ఇప్పుడు రేషన్‌కార్డు దరఖాస్తుదారులకు శాపంగా మారాయి. మ్యాపింగ్‌లో మార్పులు, చేర్పులు, ఎడిట్ చేసే అవకాశాన్ని ఇవ్వకపోవడం పెద్ద సమస్యగా మారింది. ఈ సమస్యను పరిష్కరించకపోతే కొత్త రేషన్‌కార్డు పొందే అవకాశాన్ని కోల్పోతారు.

(పిఠాపురం- ఆంధ్రజ్యోతి)

కొత్త రేషన్‌కార్డులకు దరఖాస్తులను స్వీకరిస్తామని ప్రభుత్వం ప్రకటించిన ఆనందం ఆన్‌లైన్ కష్టాలతో ఆవిరైపోతోంది. దరఖాస్తులకు పెట్టిన నిబంధనలతో ప్రజలు సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో తప్పులతడకగా ఉన్న హౌస్ మ్యాపింగ్‌ను ఇప్పుడు దరఖాస్తుల స్వీకరణకు ప్రామాణికంగా తీసుకోవడంతో పాట్లు తప్పట్లేదు. అందులో కుటుంబసభ్యుల మ్యాపింగ్ ఒకేచోట జరగకుంటే వారి దరఖాస్తులు ఆన్‌లైన్ కావట్లేదు. మ్యారేజ్ సర్టిఫికెట్‌ను తప్పనిసరి చేయడంతో అది ఎలా తెచ్చుకోవాలో తెలియక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ఇది తప్పనిసరి కాదని మంత్రులు, ప్రజాప్రతినిధులు ప్రకటించినా అది లేకుండా దరఖాస్తు తీసుకోకపోవడంతో ప్రజలకు కష్టాలు తప్పడం లేదు. తాజాగా ఆశాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ సైతం ప్రకటించారు. ఇక బయోమెట్రిక్స్ పడకపోయినా దరఖాస్తు ఆన్‌లైన్ కావట్లేదు. ఓటీపీ ఆప్షన్ డిజేబుల్ చేయడంతో వేలిముద్రలు పడని వారు పడుతున్న ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా ఇదే స్థితి నెలకొంది.

- నూతన రేషన్‌కార్డులకు ఆన్‌లైన్‌లో అవస్థ
- మ్యాపింగ్ ఆధారంగానే దరఖాస్తుల స్వీకరణ
- నాటి హౌస్‌మ్యాపింగ్‌లో పలు లోపాలు
- కొత్త కార్డుల జారీకి అదే ప్రామాణికం
- మ్యారేజ్ సర్టిఫికెట్‌కు తంటాలు
- అవసరం లేదంటున్న మంత్రి నాదెండ్ల
- బయోమెట్రిక్స్ పడకుంటే నో ఛాన్స్
- ఓటీపీ ఆప్షన్ డిజేబుల్
- రేషన్‌కార్డు దరఖాస్తు ఉచితం
- రూ.100 వసూలు చేస్తున్న సిబ్బంది
- సచివాలయాల్లో దరఖాస్తులకు పాట్లు

నిబంధనలు సడలించాలి..

హౌస్‌హోల్డ్ మ్యాపింగ్ నిబంధన తొలగించడంతోపాటు ఆధార్ ఆధారంగానే దరఖాస్తుల స్వీకరణ ఉండాలని, మ్యారేజ్ సర్టిఫికెట్ నిబంధన తొలగించి వీఆర్వో లేదా సంబంధిత పంచాయతీ కార్యదర్శి ధ్రువీకరణతో ఆన్‌లైన్ చేసే అవకాశం కల్పించాలని, బయోమెట్రిక్స్‌తోపాటు ఓటీపీ ఆప్షన్ ఇవ్వాలని, ఉమ్మడి కార్డులో ఉన్న ఎంతమందైనా విడిగా కార్డులకు దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించాలని పలువురు సూచిస్తున్నారు.

దరఖాస్తు చేయాలంటే రూ.100

రేషన్‌కార్డు దరఖాస్తు ప్రభుత్వం ఉచితమని ప్రకటించింది. అయితే సచివాలయ సిబ్బంది మాత్రం కార్డుకు రూ.100 వసూలు చేస్తున్నట్టు సమాచారం. తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరంలోని ఒక సచివాలయంలో దరఖాస్తుదారుల నుంచి ఒక్కో కార్డుకు రూ.100 వసూలు చేస్తున్నట్టు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా చాలాచోట్ల ఇదే పరిస్థితి ఉంది.

మ్యారేజ్ సర్టిఫికెట్ అక్కర్లేదు!

కొత్తగా కార్డు పొందడానికి మ్యారేజ్ సర్టిఫికెట్ తప్పనిసరి చేశారు. వివాహమైన వారిలో 95 శాతం మంది రిజిస్ట్రేషన్ చేసుకోరు. దీంతో ఇప్పుడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు వెళ్లి మ్యారేజ్ రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇందుకు రూ.2,500 నుంచి రూ.5 వేల వరకు ఖర్చు చేయాల్సి వస్తోందని పలువురు వాపోతున్నారు. అయితే మ్యారేజ్ సర్టిఫికెట్ అవసరం లేదని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ గురువారం ప్రకటించారు.

బయోమెట్రిక్స్...

కార్డుల దరఖాస్తులను ఆన్‌లైన్ చేసే ప్రక్రియలో ప్రధాన దరఖాస్తుదారుడు తప్పనిసరిగా తన బయోమెట్రిక్స్ (వేలిముద్రలు) వేయాల్సి ఉంటుంది. బయోమెట్రిక్స్ పడకుంటే దరఖాస్తు ఆన్‌లైన్ కావట్లేదు. గతంలో ఆధార్‌కు లింక్ అయిన మొబైల్‌కు ఓటీపీ వచ్చేది. దీని వల్ల బయోమెట్రిక్స్ పడనివారికి ఉపయోగకరంగా ఉండేది. ఓటీపీ ఆప్షన్ డిజేబుల్ చేశారని చెబుతున్నారు.

ఇద్దరుంటే.. ఒకరికే ఛాన్స్

తల్లిదండ్రులతో కలిసి ఉన్న కొడుకులు, కుమార్తెలకు వివాహమై కొత్త కార్డు పొందేందుకు విభజన అవకాశాన్ని కల్పించిన ప్రభుత్వం దానిని ఒక్కరికే పరిమితం చేసింది. ఇద్దరు పిల్లలు ఉండి, వారికి వివాహమైతే అందులో ఒక్కరినే విభజించే అవకాశం ఉండడంతో రెండో వారు దరఖాస్తు చేసుకునే వీల్లేకుండా పోతోంది.

- మ్యాపింగ్ సమయంలో భర్త వేరే ప్రాంతంలో ఉండడంతో పేరు కుటుంబంలో చేర్చకున్నా భార్యపిల్లలకు కార్డు రావడం లేదు. భర్త లేకుండా విడిగా దరఖాస్తు చేసుకునే అవకాశం లేదు.

ఆధార్ చిరునామాతోనే...

- ఆధార్ కార్డులో ఉన్న చిరునామానే దరఖాస్తు స్వీకరణ సమయంలో పరిగణనలోకి తీసుకుంటున్నారు. చిరునామా మార్పునకు అవకాశం ఇవ్వకపోవడంతో పాత చిరునామాలతోనే దరఖాస్తు చేస్తున్నారు. వివాహమైన తర్వాత ఆధార్‌లో భార్య ఇంటి పేరు మారకున్నా, భార్యాభర్తల ఇంటి పేర్లు ఒకేలా లేకున్నా ఆన్‌లైన్‌లో తీసుకోవట్లేదు. చదువుకున్న వారు ఉద్యోగాల కోసం ఆధార్‌లో ఇంటి పేరు మార్చుకోవడం లేదు. అటువంటి వారికి ఇబ్బంది ఎదురవుతోంది.
- చిన్నారుల బాల ఆధార్ అప్‌డేట్ అయితే కానీ వారి పేర్లను తల్లిదండ్రుల కార్డుల్లో చేర్చడానికి అవకాశం ఉండట్లేదు. ఇప్పుడు అప్‌డేట్ చేయించాలంటే కార్డుల దరఖాస్తు గడువు ముగిసిపోతుందని చెబుతున్నారు. దీంతో తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గడువు ఇవ్వాలని కోరుతున్నారు.



రాఘవకుమార్‌కు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలుపుతున్న ఉద్యోగులు

ఆర్టీసీ జిల్లా ఇన్‌ఛార్జిగా రాఘవకుమార్

రాజమహేంద్రవరం అర్బన్, మే 15 (ఆంధ్రజ్యోతి) :డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆర్టీసీ అధికారిగా పనిచేస్తున్న ఎస్‌టీపీ రాఘవకుమార్ గురువారం తూర్పుగోదావరి జిల్లాకు ఇన్‌చార్జి అధికారిగా ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఇటీవలే ఇక్కడ పనిచేస్తున్న షర్మిలాఅశోక వేరేచోటకు బదిలీ కావడంతో రాఘవకుమార్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు.ఈ నేపథ్యంలో రాఘవకుమార్ రాజమహేంద్రవరంలోని ఆర్ఎం కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. పలువురు కార్యాలయ అధికారులు కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షకు 495 మంది గైర్హాజరు

రాజమహేంద్రవరం, మే 15(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షల్లో భాగంగా గురువారం నిర్వహించిన పరీక్షలకు 495 మంది గైర్హాజరయ్యారని ఆర్ఐవో ఎన్ ఎస్‌వీఎల్ నరసింహం తెలిపారు. ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోలేదన్నారు.

పారిశ్రామికవేత్తలుగా డ్వాక్రా మహిళలు : జేసీ

రాజమహేంద్రవరం, మే 15(ఆంధ్రజ్యోతి): ఈ నెలాఖరు నాటికి 2 వేల మంది స్వయం సహాయక సంఘాల మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే ప్రక్రియలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జేసీ ఎస్.చిన్నరాముడు పేర్కొన్నారు.కలెక్టరేట్‌లో డీఆర్‌డీఏ, మెప్మా, బ్యాంకర్లతో గురువారం నిర్వహించిన సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. డ్వాక్రా మహిళల ఆర్థిక సాధికారతకు వ్యవసాయ అనుబంధ రంగాల వారీగా కార్యాచరణ ప్రణాళిక రూపొం దించామన్నారు.ఈ లక్ష్య సాధనకు బ్యాంకర్లు రుణాలు మంజూరు చేయాలన్నారు. ఇప్పటికే ఆయా శాఖల ఆధ్వర్యంలో యూనిట్ల స్థాపనకు మండల పరిధిలో లక్ష్యా ల్ని నిర్దేశించామన్నారు.కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ మూర్తి,ఎల్‌డీఎం డీవీ ప్రసాద్ పాల్గొన్నారు.

కాలం తీరిన.. మందులు దాచారు!



- పొలమూరు వెల్‌నెస్ సెంటర్‌లో వైద్య సిబ్బంది నిర్లక్ష్యం
- 2022 నుంచి 2024 వరకు కాలం తీరిన మందులు
- అడుగుదామని ప్రయత్నిస్తే కానరాని సిబ్బంది

అనపర్తి, మే 15 (ఆంధ్రజ్యోతి) : కాలం చెల్లిన మందులు విషంతో సమానం.. ఆ మందులు వినియోగిస్తే ఎన్నో సమస్యలు వస్తాయి. అయితే జిల్లాలోని ఒక ప్రభుత్వ ఆసుపత్రిలో మాత్రం అవే మందులు వినియోగిస్తున్నట్టు సమాచారం. పల్లెటూరు వాసులు జర్వం వచ్చినా చిన్న దెబ్బ తగిలినా వెంటనే పరిగెత్తేది గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికే. వారు ఇచ్చే మందులు రోజుకు ఎన్ని సార్లు వేసుకోవాలి అని అడగడం తప్ప మందుల కాల పరిమితి ఎంత ఎప్పుడు తయారైంది ఎప్పటి వరకు వాడవచ్చన్న కనీస అవగాహన ఉండదు. దీంతో వైద్య సిబ్బంది ఏ మందు ఇస్తే అదే వేసుకుంటారు.. అయితే ప్రభుత్వం గ్రామాల్లో ప్రజారోగ్యం కోసం ఏర్పాటు చేసిన హెల్త్ క్లినిక్‌లలో సిబ్బంది నిర్లక్ష్యంతో అనేక మంది అనారోగ్యాల భారిన పడుతున్నారు.అనపర్తిలోని సచివాలయం 5 పరిధిలోని వెల్‌నెస్ సెంటర్‌పై ఇటీవల కాలంలో అనేక ఫిర్యాదులు వస్తున్నాయి. విలేజ్ క్లినిక్‌లో విధులు నిర్వహిస్తున్న ఏఎన్‌ఎం రాజేశ్వరి సక్రమంగా విధులు నిర్వహించడం లేదని వచ్చిన రోగులపై విరుచుకు పడుతున్నారని ఫిర్యాదులు రావడంతో ఎంపీడీవో రామకృష్ణారెడ్డి క్లినిక్‌లో విచారణ నిర్వహించి సిబ్బందిని మందలించారు. అయినా వెల్‌నెస్ సెంటర్లలో పరిస్థితి మారకపోవడంతో అనేక విమర్శలు వినిపిస్తున్నాయి. ఇదిలా ఉండగా గురువారం పొలమూరులోని వెల్‌నెస్ క్లినిక్ సెంటర్‌కు వెళ్లిన మీడియాకు క్లినిక్‌లో సిబ్బంది ఎవరూ కనిపించలేదు. సెంటర్‌లో విధులు నిర్వహిస్తున్న ఎమ్ఎల్‌హెచ్‌పీ నాగరాణి గత నెల 26 నుంచి ధర్నాలో ఉండడంతో సెంటర్‌లో ఏఎన్‌ఎం కాని ఆశ వర్కర్ గాని ఉండాల్సి ఉండగా సెంటర్‌లో ఎవరూ లేరు. చివరకు అక్కడ ఉన్న మందులను పరిశీలించగా ఎక్కడ చూసినా కాలం చెల్లిన మందులే దర్శనమిచ్చాయి. దగ్గు మందు నుంచి ఇంజక్షన్లు,మాత్రలు వంటి అనేక మందులు కాలం చెల్లినవిగా ఉన్నాయి.వీటిలో కొన్ని 2022లోనే కాలం చెల్లినవి మరికొన్ని 2023, 2024 ఇలా అనేక మందులు దర్శనమిచ్చాయి. విషయం తెలుకుని అక్కడికి చేరుకున్న కూటమి నాయకులు ఉన్నతాధికారులకు ఫోన్‌లో పరిస్థితి వివరించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించి ప్రజల ఆరోగ్యంతో ఆటలాడుతున్న సిబ్బందిపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.









కాలం చెల్లిన మందులు.. ఆసుపత్రిలో పరిశీలిస్తున్న కూటమి నాయకులు

యువకుడి ఆత్మహత్య

నిడదవోలు, మే 15 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ కలహాల కారణంగా ఒక యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నిడదవోలు మండలం పురుషోత్తపల్లికి చెందిన తణుకు మోహనకృష్ణ(31) డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు.అయితే ఇటీవల ఇంట్లో తల్లి, భార్యకు అసలు పడడం లేదు. ఈ నేపథ్యంలో తరచూ గొడవలు జరుగుతున్నాయి.భరించలేకపోయిన మోహనకృష్ణ బుధవారం కలుపుమందు తాగేశాడు. కుటుంబీకులు గమనించి రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. మృతుడికి భార్య, పిల్ల లు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.



3 గంటల పాటు నిలిచిన వివేక్ ఎక్స్‌ప్రెస్

సాంకేతిక లోపం కారణంగా దేశంలోనే అతి ఎక్కువ దూరం ప్రయాణించే వివేక్ ఎక్స్‌ప్రెస్ రైలు రాజమహేంద్రవరంలో గురువారం రాత్రి 3 గంటల పాటు నిలిచిపోయింది.. - వివరాలు 8లో

తూర్పున వైద్యం అద్వితీయం

రాష్ట్రస్థాయిలో జిల్లాకు రెండో ర్యాంకు 8

ఐదు రోజుల చిన్నారి.. రూ.4 లక్షల సాయం

చిన్నారికి తీవ్ర అనారోగ్యం.. మంత్రి దుర్గేష్ దాతృత్వం

నిడదవోలు, మే 15 (ఆంధ్రజ్యోతి) : ఆ చిన్నారికి ఐదు రోజులు.. అయితే గుండె, ఊపిరితిత్తుల సమస్యతో జన్మించింది.. ప్రస్తుతం రాజమహేంద్రవరంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స చేస్తున్నారు.నిడదవోలు మండలం కోరుమామిడి గ్రామానికి చెందిన పసలపూడి నాగచంద్రంకు ఈ నెల 11వ తేదీన ఒక చిన్నారి జన్మించింది. అయితే చిన్నారి పుట్టిందన్న ఆనందం క్షణాల్లో ఆవిరైంది. ఎందుకంటే పెద్ద అనారోగ్య సమస్యలో జన్మించడంతో రెక్కాడితే కానీ డొక్కాడని తల్లిదండ్రులు ఉన్న కాస్తపాటి సొమ్ము చిన్నారి వైద్యానికి ఖర్చు చేసేశారు. ఇక చేసేది లేక ఏం చేద్దామా అని ఆలోచనలో పడ్డారు. ఈ విషయం అమరావతిలో కేబినెట్ మీటింగ్‌లో ఉన్న రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖా మంత్రి కందుల దుర్గేష్ తెలిసింది. అంతే ఆయన వెంటనే స్పందించారు. ఆ చిన్నారికి మెరుగైన వైద్య సేవలందించేందుకు 24 గంటల లోపుగానే రూ.4 లక్షల లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎన్‌వోసీ)ని మంజూరు చేయి ంచారు. ఆ చిన్నారికి తక్షణ వైద్య చికిత్స అందించాలని సూచించారు.

పంగిడిలో ఉచిత వైద్యశిబిరం



వైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, తదితరులు

కొవ్వూరు, మే 15 (ఆంధ్రజ్యోతి) : పంగిడిలో జనసేన నాయకుడు కొప్పాక విజయకుమార్ ఆధ్వర్యంలో గురువారం జనసేన, గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ ద్వారా ఉచిత మెడికల్ క్యాంపును ఏర్పాటుచేశారు. ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే టీవీ రామారావు హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ శిబిరంలో సుమారు 100 మందికి పైగా ప్రజలకు వైద్యపరీక్షలు నిర్వహించారు. అనంతరం పలు విషయాలపై మాట్లాడారు. కార్యక్రమంలో జనసేన పార్టీ గ్రామ అధ్యక్షుడు వాసిరెడ్డి వెంకటేష్, టీడీపీ నాయకులు పొట్రు సిద్ధూ, బీజేపీ నాయకులు పెరుగు పోతురాజు, జనసేన నాయకులు పెరుగు శివ, మడిచర్ల నాగరాజు, పూటి జగదీష్, శ్రీను, పెరుగు సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

శేషారావును కలిసి పలువురు టీడీపీ నేతలు



శేషారావుకు అభినందనలు తెలుపుతున్న దృశ్యం

చాగల్లు, మే 15 (ఆంధ్రజ్యోతి): ఏపీ నైపుణ్యాభివృద్ధి కార్పొరేషన్ సంస్థ చైర్మన్‌గా నిడదవోలు మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నేత బూరుగుపల్లి శేషారావును ప్రభుత్వం నియమించింది. ఈ సందర్భంగా మండలం నుంచి పలువురు ఆయన్ని గురువారం కలిసి అభినందనలు తెలిపారు. కొవ్వూరు, నిడదవోలు పరిధిలోని రైస్‌మిల్లర్ల అసోసియేషన్ నేతలు గారపాటి బాబూరావు, సుంకవల్లి రమేష్, గన్నమని శ్రీనివాస్, ఆత్కూరి కృష్ణ బొడ్డు రాజు, తదితరులు కలిసినవారిలో ఉన్నారు. వారు మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారికి తగిన గుర్తింపు లభిస్తుందన్నారు.

యర్నగూడెం గ్రంథాలయంలో డ్రాయింగ్ పోటీలు



యర్నగూడెం గ్రంథాలయంలో డ్రాయింగ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

దేవరపల్లి, మే 15 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందించడానికి డ్రాయింగ్, క్రాఫ్ట్ పోటీలు ఎంతో ఉపయోగపడతాయని గ్రంథాలయాధికారి అనిత పేర్కొన్నారు. యర్నగూడెం గ్రంథాలయంలో గురువారం వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా విద్యార్థులకు డ్రాయింగ్, క్రాఫ్ట్‌పోటీలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గత నెల 28వ తేదీ నుంచి జూన్ 6 వరకు వేసవిశిక్షణ శిబిరంలో పలు అంశాలపై పోటీలు నిర్వహిస్తామన్నారు. అందులో గెలుపొందిన వారందరికీ వచ్చేనెల 6వ తేదీన బహుమతుల ప్రదానం చేస్తామన్నారు. డ్రాయింగ్ టీచర్ మురళి, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఆధార్ ప్రత్యేక శిబిరాలు

ఉండ్రాజవరం, మే 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలంగి, సూర్యారావుపాలెం గురువారం ఆధార్ ప్రత్యేక శిబిరాలు నిర్వహించినట్టు ఎంపీడీవో వీఎస్ రామారావు తెలిపారు. ఈ శిబిరాలు ద్వారా 128 మందికి ఆధార్ కార్డులో మార్పులు, చేర్పులు చేసినట్టుపేర్కొన్నారు. ఇందులో భాగంగా 5 నుంచి 18 సంవత్సరాలలోపు పిల్లలకు బయోమెట్రిక్ అప్‌డేట్ చేశామన్నారు.

రోడ్డుపై మురుగు.. పట్టించుకోరూ..!

- చీపురుగూడెంలో అధ్వానంగా డ్రైనేజీ వ్యవస్థ
- పట్టించుకోని పంచాయతీ అధికారులు
- మూడు నెలలుగా నరకం అనుభవిస్తున్న గ్రామస్థులు



చీపురుగూడెంలో రోడ్లపై ప్రవహిస్తున్న డ్రైనేజీ నీరు

నల్లజర్ల, మే15 (ఆంధ్రజ్యోతి):మండలంలోని చీపురుగూడెంలో పారిశుధ్యం మరింత అధ్వానంగా మారింది. దీంతో గ్రామస్థులు నానా అవస్థలు పడుతున్నారు. ఆ నీరంతా తాగునీటిలో కలిసిపోతుండడంతో నిత్యం గ్రామస్థులు నరకం అనుభవిస్తున్నారు. దీనిపై పంచాయతీ అధికారులకు మొరపెట్టుకున్నా ... ఫలితం శూన్యమని వార్డుమెంబర్ చెల్లు శిరీష వాపోయారు. గత మూడునెలలుగా తమ ఇంటి సమీపంలో డ్రైనేజీ వ్యవస్థ పొంగి రోడ్లపై ప్రవహిస్తుండడంతో దుర్వాసన వెదజల్లుతోందని ఆయన పేర్కొన్నారు. నూతనంగా వేసిన పైపు లైన్ల వల్ల పాతపైపు లైన్లు లీకేజీలు వచ్చి నీరు వస్తున్న సమయంలో ఆ నీరు డ్రైనేజీలో చేరి నీరు ఆగిపోయిన తర్వాత డ్రైనేజీ నీరు పైపుల్లోకి వెళుతుంది. దీని ద్వారా తాగునీరు కలుషితం అవుతుంది. పడమర వీధిలో మూడు చోట్ల డ్రైనేజీ నీరు రోడ్లపై పారుతోంది. దీంతో ప్రజలంతా ఆ డ్రైనేజీ నీళ్లలోనే నడిచి వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి రామారావును వివరణ కోరగా, ప్రతిరోజూ డ్రైనేజీపూడిక తీస్తున్నా... మళ్లీ సమస్య వస్తుంది. త్వరలో సమస్య పరిష్కరిస్తామని చెప్పారు.

ఎస్సీ కమిషన్ చైర్మన్‌ను కలిసిన దేవరపల్లి నాయకులు



జవహర్‌తో పాటు ఉన్న దేవరపల్లి ఎస్సీ కూటమి నాయకులు

దేవరపల్లి, మే 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్‌గా నియమితులైన మాజీమంత్రి, టీడీపీ సీనియర్ నేత కేఎస్ జవహర్‌ను స్థానిక డైమండ్ జంక్షన్ వద్ద దేవరపల్లి ఎస్సీ కూటమినాయకులు కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందదర్భంగా జవహర్ మాట్లాడుతూ ఎస్సీ కమిషన్ చైర్మన్‌గా తనని నియమించటంపై ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. ఎస్సీల సమస్యలు పరిష్కరించడానికి ఎల్లప్పుడూ అండగా ఉంటానన్నారు. బీజేపీ ఎస్సీ మోర్చ జిల్లా అధ్యక్షుడు దున్న సుమన్ బాబు, ఎంఆర్‌పీఎస్ నేత సూరి, జైభీమ్ సేవాదళ్ అధ్యక్షుడు మడతల శంకరం, రాపాక అబ్బులు, మహేశ్, ఎం. భాస్కర్ కుమార్, కే.సతీష్, తదితరులు పాల్గొన్నారు.

అపరభగీరథుడు ... కాటన్‌దొర

- ఘనంగా జయంతి





కొవ్వూరు ఎల్ఐసీ సెంటర్, నిడదవోలులో పూలమాలలు వేసి నివాళి అర్పిస్తున్న దృశ్యం

కొవ్వూరు, మే 15(ఆంధ్రజ్యోతి):దవళేశ్వరంపై ఆనకట్ట నిర్మించి, ఉభయ గోదావరి జిల్లాలను సస్యశ్యామలం చేసిన అపరభగీరథుడు సర్ ఆర్థర్ కాటన్ అని కొవ్వూరు రైస్ అండ్ కిరాణా మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎంబీఎస్ ప్రసాద్ (దత్తుడు) కొనియాడారు. కాటన్‌దొర 222వ జయంతిని పురస్కరించుకుని గురువారం స్థానిక ఎల్ఐసీ సెంటర్, పాతరైలు వంతెన సమీపంలోని ఆయన విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దవళేశ్వరం బ్యారేజ్ నిర్మాణంతో ఉభయ గోదావరి జిల్లాలలో లక్షలాది ఎకరాలకు సాగు, తాగునీరు అందుతున్నాయన్నారు. కొల్లేపర శ్రీనివాస్, తుమ్మలపల్లి నాగరమేష్, పెన్నుగొండ భద్రం, కూరపాటి ఆనంద్, వజ్రవనిత వాసవీక్లబ్ అధ్యక్షురాలు మద్దుల నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

నిడదవోలు: గోదావరి జిల్లాలను సస్యశ్యామలం చేసి ఆరాధ్యదైవంగా నిలిచిన వ్యక్తి సర్ ఆర్థర్ కాటన్ అని ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ కె. మురళీకృష్ణంరాజు అన్నారు. గురువారం శెట్టిపేట నీటిపారుదలశాఖ కార్యాలయంఆవరణలో ఉన్న కాటన్ కాంస్య విగ్రహం వద్ద 222వ జయంతిని పురస్కరించుకుని నివాళి అర్పించారు. ఆయన మాట్లాడుతూ గోదావరి నదిపై ఆనకట్ట నిర్మించి గోదావరి జిల్లాలోని పంట భూములను సస్యశ్యామలం చేశారన్నారు. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి.సుబ్రహ్మణ్యేశ్వరరావు, పి.నాగార్జునరావు, కె.నందీశ్వరుడు, ఎ.మందేష్, కె.నాగేశ్వరరావు, పి.మాణిక్యాలరావు, బి.కిషోర్ పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: పసలపూడి గ్రామపరిధిలో లాకు కార్యాలయం వద్ద గురువారం సర్ ఆర్థర్ కాటన్ మహనీయుడి జయంతిని లాకు సూపరింటెండెంట్ ఎం. విజయకుమార్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సిబ్బంది ఎం. సురేష్, కె. సుబ్బారావు, ఆర్. సురేష్, తదితరులు పాల్గొన్నారు. అలాగే కాల్ధరి, ఉండ్రాజవరం, చిలకపాడు, తదితర గ్రామాల్లో కాటన్ విగ్రహాలకు రైతులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.



పసలపూడి లాకు వద్ద కాటన్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న దృశ్యం

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు



చిన్నారులకు పుస్తక పఠనంపై అవగాహన కల్పిస్తున్న రిసోర్స్‌పర్సన్ జనార్దనరావు

నిడదవోలు, మే 15 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని, విద్యార్థులు వీటిని సద్వినియోగపర్చుకోవాలని రిసోర్స్ పర్సన్ వి.జనార్దనరావు అన్నారు. గురువారం పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులకు పుస్తకపఠనంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కె.ప్రభాకరం, గ్రంథాలయ అధికారి గద్దే శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

జూలై 5వ తేదీకి జాతీయ లోక్ అదాలత్ మార్పు



సమావేశంలో మాట్లాడుతున్న 9వ అదనపు జిల్లా జడ్జి ఎం. అనురాధ

కొవ్వూరు, మే 15 (ఆంధ్రజ్యోతి): మే 10వ తేదీన జరగాల్సిన లోక్‌అదాలత్ జూలై 5వ తేదీకి మార్పుచేసినట్టు కొవ్వూరు మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, 9వ అదనపు జిల్లా జడ్జి ఎం. అనురాధ తెలిపారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఉత్తర్వుల మేరకు మార్పుచేసిన విషయాన్ని న్యాయవాదులు, కక్షిదారులు గమనించాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

తాళ్లపూడి, మే 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్నదేవరపేట విద్యుత్ సబ్‌స్టేషన్ నందు 11 కేవీ ఫీడర్ మరమ్మతుల నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ నారాయణ అప్పారావు తెలిపారు. అన్నదేవరపేట, సూరయ్యపేటలో ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు విద్యుత్ ఉండదన్నారు.

గోపాలపురం: చెట్ల తొలగింపులో భాగంగా శుక్రవారం విద్యుత్ సరఫరాను నిలుపుదల చేస్తున్నట్టు ఏఈ ఎన్.నారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. గోపాలపురం సబ్‌స్టేషన్ పరిధిలోని 33/11 కేవీ, 11కేవీ సత్యసాయి ఇండస్ట్రీయల్ ఫీడర్ పరిధిలో ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరా ఉండదన్నారు.

సీతానగరం: కాటవరం, జాలిమూడి గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జేపీబీ నటరాజన్ తెలిపారు.33/11 కేవీ కాటవరం సబ్‌స్టేషన్ నుంచి కొత్తగా 11కేవీ కాటవరం ఫీడర్ లైన్ పనుల కారణంగా ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరా ఉండదని, వినియోగదారులు ఈ సౌకార్యాన్ని గమనించి సహకరించాలని కోరారు.

టాప్ టెన్‌లో..

- ఉమ్మడి జిల్లాలోని వైద్య, ఆరోగ్యశాఖలకు ఉత్తమ ర్యాంకులు
- రాష్ట్రస్థాయిలో తూర్పు గోదావరికి రెండో స్థానం
- ఏడు, పది స్థానాల్లో నిలిచిన కోనసీమ, కాకినాడ జిల్లాలు

2, 7, 10.. ఇవీ రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మన ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖలకు కేటాయించిన ర్యాంకులు. వివిధ అంశాలను పరిగణనలోకి తీసుకుంటూ ఈ ర్యాంకులను ప్రకటించింది. ఇందులో టాప్ టెన్‌లో తూర్పుగోదావరి రెండో స్థానంలో, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఏడో స్థానంలో, కాకినాడ జిల్లా పదో స్థానంలో నిలిచాయి.

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పనితీరు, మాతా-శిశు ఆరోగ్యం తదితర 11అంశాల్లో రాష్ట్రంలో కాకినాడ జిల్లా పదో స్థానంలో నిలిచింది. ఈ మేరకు రాష్ట్ర వైద్య, ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ రెండు రోజుల క్రితం ర్యాంకులు వెల్లడించింది. 2024-25 సంవత్సరానికి సంబంధించిన సమాచారం ఆధారంగా వీటిని కేటాయించారు. మొత్తం వంద మార్కులకు కాకినాడ జిల్లాకు 80.08, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాకు 81.32, తూర్పుగోదావరి జిల్లాకు 82.63 వచ్చాయి. రాష్ట్రంలో తూర్పుగోదావరి జిల్లా రెండు, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఏడు, కాకినాడ జిల్లా పది స్థానాల్లో నిలిచాయి.

మార్కులు ఇలా..

మొత్తం 12 అంశాలను పరిగణలోకి తీసుకుని మార్కులువేశారు. ఒక్కో అంశానికి పది మార్కులు, మరికొన్ని అంశాలకు ఐదేసి మార్కుల చొప్పున ఈ ర్యాంకులను కేటాయించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పనితీరుకు మొత్తం పది మార్కులు కేటాయించగా కాకినాడజిల్లాకు 6.93 మార్కులు వచ్చాయి. 3.07 మార్కులు తగ్గాయి. వీటి పనితీరు కాస్త ఫర్వాలేదనిపిస్తోంది. మాతా-శిశుఆరోగ్యానికి 25 మార్కులకు కాకినాడ జిల్లాకు 21.89, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాకు 21.88, తూర్పుగోదావరిజిల్లాకు 22.56 వచ్చాయి. ఎన్‌యూహెచ్‌ఎం, వ్యాధుల నియంత్రణ, డీసీహెచ్ఎస్‌కు 25 మార్కులకు కాకినాడ జిల్లాకు 24.10, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాకు 22.58, తూర్పుగోదావరి జిల్లాకు 22.22 వచ్చాయి. కుటుంబనియంత్రణ, ఆరోగ్యసముదాయానికి సంబంధించి ఐదు మార్కులకు కేవలం 1.86 మార్కులే కాకినాడ జిల్లాకు వచ్చాయి. ఈ విషయంలో వెనుకబడే ఉంది. ఎచ్‌డబ్ల్యూసీకి సంబంధించి మొత్తంపది మార్కులకు కాకినాడ జిల్లాకు 9.8, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాకు 9.83, తూర్పుగోదావరి జిల్లాకు 9.97 వచ్చాయి. ఆభ, ఎఫ్ఆర్ఎస్‌కు సంబంధించి మొత్తం ఆరు మార్కులకు కాకినాడ జిల్లాకు 5.08, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాకు 5.08, తూర్పుగోదావరి జిల్లాకు 5.12 వచ్చాయి.

ర్యాంకింగ్ సంతృప్తికరమే..



రాష్ట్ర వైద్య, ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ విడుదల చేసిన ర్యాంకింగ్‌లో టాప్ టెన్‌లో నిలవడం సంతృప్తినిచ్చింది. మొత్తం మూడు కేటగిరీల్లో ఈ ర్యాంకులను ప్రకటించారు. ప్రస్తుతం గుడ్ ఫెర్మార్మెన్స్ కేటగిరీలోనే కాకినాడజిల్లా ఉంది. కేవలంరెండు, మూడు మార్కుల తేడాలోనే ర్యాంకులు మారాయి. మన జిల్లాకు సంబంధించి కుటుంబ నియంత్రణ, కౌమార బాలిక ఆరోగ్యానికి సంబంధించి ఐదుమార్కులకు 1.86, క్వాలిటీ ఎస్యూరెన్స్‌కు సంబంధించి నాలుగు మార్కులకు 1.20 వచ్చాయి.

-డాక్టర్ జె.నరసింహనాయక్, డీఎంహెచ్‌వో, కాకినాడ జిల్లా

3 గంటల పాటు రాజమండ్రిలో వివేక్ ఎక్స్‌ప్రెస్

- ఊడిన ఏసీ బోగీ యాక్సిల్ బాక్స్ రింగ్ కవర్
- గుర్తించి నిలిపివేసిన టీఎక్స్‌ఆర్ సిబ్బంది



రాజమహేంద్రవరం, మే 15 (ఆంధ్రజ్యోతి): డుంబ్రిఘర్ నుంచి కన్యాకుమారి వెళ్తున్న ట్రైన్ నెంబర్ (22503) వివేక్ ఎక్స్‌ప్రెస్ మరమ్మతులకు గురికావడంతో తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రి స్టేషన్‌లో మూడుగంటల పాటు నిలిపివేశారు. ఇది భారతదేశంలో అతి ఎక్కువ రోజులు ప్రయాణించే రైలు. ఈ రైలు గురువారం రాత్రి 8:50 గంటలకు రాజమహేంద్రవరం రైల్వేస్టేషన్ మూడో ప్లాట్‌ఫాంకు చేరుకునే సమయంలో ఇంజన్ నుంచి 14వ బోగీ అయిన బీ1 ఏసీ బోగీ యాక్సిల్ బాక్స్ రింగ్‌కు ఉండే కవర్ ఊడిపోయి, బోల్టులు కూడా ఊడిపోతుండగా టీఎక్స్‌ఆర్ సిబ్బంది గుర్తించారు. అయితే కవర్ మార్చే ఏర్పాట్లు లేకపోవడంతో బీ1 బోగీని రాజమండ్రి స్టేషన్‌లో వదిలేసి మిగతా రైలును 11:50 ప్రాంతంలో పంపించారు. బీ1 బోగీలోని ప్రయాణికులను వేరే బోగీలో సర్దుబాటు చేశారు. విశాఖలో మరొక బోగీని లింక్ చేస్తామని అధికారులు తెలిపారు. ఎస్ఎంఆర్ రంగనాథ్, చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ కల్యాణ్ కుమార్ మరమ్మతులను పర్యవేక్షించారు. ఆర్‌పీఎఫ్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. ఈ విషయాన్ని గుర్తించకపోతే రైలు పట్టాలు తప్పి పెను ప్రమాదమే కలిగేది.

గోదావరి నదిలో గుర్తుతెలియని మృతదేహం

కొవ్వూరు, మే 15 (ఆంధ్రజ్యోతి) : గోదావరి నదిలో గుర్తుతెలియని మృతదేహాన్ని గుర్తించినట్టు పట్టణ పోలీసులు తెలిపారు. ఔరంగాబాద్ -2 ఇసుక ర్యాంపులో మగ మృతదేహం తేలుతుందని స్థానికులు పోలీసులకు సమాచారం అందజేశారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని నది నుంచి బయటకు తీయించారు. పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి సంబంధించిన వివరాలు తెలియరాలేదు. సుమారు 50 సంవత్సరాల వయసు ఉంటుందని, ఒంటిపై వైట్ కలర్ కట్ బనియన్, నలుపురంగు షార్ట్ ధరించి ఉన్నాడని, ఆచూకీ తెలిసినవారు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో గానీ లేదా 9440796622, 94924 82056 నెంబర్లకు సమాచారం అందించాలన్నారు. దీనిపై కేసు నమోదు చేసినట్టు పట్టణ సీఐ తెలిపారు.

గామన్‌బ్రిడ్జి దిగువన మరో...

కొవ్వూరు, మే 15 (ఆంధ్రజ్యోతి) : గోదావరి నదిలో గుర్తుతెలియని మృతదేహాన్ని గుర్తించినట్టు పట్టణ పోలీసులు తెలిపారు. ఆరికిరేవుల రోడ్‌లోని దండకుంట పుంత ఇసుకర్యాంపులో గామన్‌బ్రిడ్జి కింద గోదావరి నదిలో గుర్తుతెలియని మగ మృతదేహం తేలుతుందని స్థానికులు పోలీసులకు సమాచారం అందజేశారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని నది నుంచి బయటకు తీయించారు. పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతునికి సంబంధించి ఎటువంటి వివరాలు తెలియరాలేదని, వయస్సు సుమారు 40 సంవత్సరాలు ఉంటుందని, ఒంటిపై నీలం, తెలుపురంగుల గడుల షర్ట్, నీలంరంగు ప్యాంటు ధరించి ఉన్నాడని, ఆచూకీ తెలిసినవారు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో గానీ లేదా 9440796622, 9492482056 నెంబర్లకు సమాచారం అందించాలన్నారు. దీనిపై కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు.

లారీ ఢీకొని మహిళ మృతి



దూసనపూడి సుధ (ఫైల్)

కొవ్వూరు, మే 15 (ఆంధ్రజ్యోతి) : లారీ ఢీకొన్న ఘటనలో మహిళ మృతి చెందింది. ఈ సంఘటన కొవ్వూరు పట్టణంలో గురువారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే పట్టణంలోని జగనన్నకాలనీ గుత్తావారి చెరువు లేఅవుట్ - 1లో నివాసముంటున్న దూసనపూడి సుధ (46) నందమూరు రోడ్‌లోని ఓ టైలరింగ్ షాపులో పనిచేస్తోంది. భర్త కృష్ణసాయి ఆటో నడుపుతుంటాడు. కుమార్తె శ్రీలత డిగ్రీ చదువుతోంది. ప్రతిరోజు కాలనీ నుంచి భర్త లేదా కుమారుడు మోటారుసైకిల్‌పై షాపు వద్ద దిస్తుంటారు. రోజు మాదిరిగానే కుమారుడు చరణ్ గురువారం ఉదయం తల్లిని మోటారుసైకిల్‌పై తీసుకుని షాపుకు బయలుదేరాడు. ఈ క్రమమంలో గామన్ బ్రిడ్జి సెంటర్ సమీపంలోని డొమ్మేరురోడ్ వేబ్రిడ్జి వద్దకు చేరుకునేసరికి వెనుక నుంచి వస్తున్న లారీ ఢీకొట్టింది. దీంతో ఇరువురు కిందపడిపోగా... సుధ నడుముపై నుంచి లారీచక్రాలు వెళ్లిపోవడంతో నుజ్జునుజ్జు అయ్యి అక్కడికక్కడే మృతిచెందింది. చరణ్‌కు కుడి చెయ్యి, కుడికాలు, కుడి పాదానికి గాయాలు కావడంతో స్నేహితుడి సహాయంతో చికిత్స నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.సమాచారం తెలుసుకున్న వెంటనే పట్టణ సీఐ విశ్వం సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలి కుమారుడు చరణ్ అందించిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో చికిత్స పొందుతూ...



గోపాలపురం పీహెచ్‌సీలో మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ సుబ్రహ్మణ్యం

దేవరపల్లి, మే 15 (ఆంధ్రజ్యోతి): లారీ ఢీకొని వ్యక్తి మృతి చెందినట్టు ఎస్ఐ సుబ్రహ్మణ్యం తెలిపారు. తాగునీరు కోసం గొల్లగూడెం నుంచి గోపాలపురం గురువారం రాత్రి మోటారుసైకిల్‌పై వెళ్తున్న ఈరోతు జయకృష్ణ (30)ను దేవరపల్లి వైపు నుంచి గోపాలపురం వైపు వెళ్తున్న లారీ ఎదురుగా వెళ్తున్న ఐషర్ వ్యాన్‌ను, పక్కగా వెళ్తున్న జయకృష్ణను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వ్యాన్‌లో ప్రయాణిస్తున్న ముగ్గురు ప్రయాణికులకు స్వల్పగాయాలు కాగా, బైక్‌పై నుంచి కిందపడిన జయకృష్ణకు తీవ్రగాయాలు కావడంతో 108 అంబులెన్స్‌లో గోపాలపురం పీహెచ్‌సీకి తరలించగా, చికిత్సపొందుతూ ఆయన మృతిచెందాడు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.